ప్రజాశక్తి
పశ్చిమగోదావరి

గురువారం
జనవరి - 4
2018

12 పేజీలు


క్రీడాప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

రూ.పది కోట్లతో ఆటస్థలాల అభివృద్ధి

రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి కెఎస్.జవహర్

ప్రజాశక్తి - కామవరపుకోట

జిల్లాలో 319 పాఠశాలల్లో ఆటస్థలాలను రూ.పది కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కెఎస్.జవహర్ చెప్పారు. మండలంలోని ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రూ.2.96 లక్షలతో నిర్మించిన క్రీడా ప్రాంగణాన్ని మంత్రి జవహర్, మాజీమంత్రి, ఎంఎల్ఎ పీతల సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లోనూ శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి వాటిని ఆటస్థల ప్రాంగణాలుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఇందుకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి నిధులను అనుసంధానం చేసుకుని పనులు చేయడం జరుగుతుందన్నారు. ఒకపక్క విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి పెంచేందుకు ఈ క్రీడాప్రాంగణాలు దోహదపడుతాయని మరోపక్క ఆ పాఠశాలలకు చెందిన ఖాళీ స్థలాలను ఇతరులు ఆక్రమించకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. ఇంకా జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఆటస్థల ప్రాంగణాలను పూర్తిచేయాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత గ్రామసర్పంచి, ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా జవహర్ కోరారు. జిల్లాలో పలు పాఠశాలల్లో ఆటస్థల ప్రాంగణాలనే కాక సభావేదికలను కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. ఇదే సమయంలో (4లో)



సోషల్ మీడియా దుమారం..!

వాట్సప్, ఫేస్‌బుక్ పోస్టులపై మంత్రులు ఫైర్
జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయం
ప్రత్యర్థులపై కేసులు సైతం నమోదు
మంత్రులు జవహర్, మాణిక్యాలరావు తీరుపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


జిల్లాలోని ప్రజాప్రతినిధుల తీరు చర్చనీయాంశంగా మారుతోంది. సోషల్ మీడియాలోని పోస్టులపై పొలిటికల్ వార్ కొనసాగుతోంది. తమపై అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారంటూ మంత్రులు కిందిస్థాయి నాయకులపై కేసులు పెట్టించే పరిస్థితికి చేరింది. దీంతో జిల్లాలో రాజకీయం కొత్తరంగు పులుముకుంటోంది. ఫేస్‌బుక్, వాట్సప్ మెసేజ్‌లపైనా మంత్రులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రాచర్చనీయాంశంగా మారుతోంది. తమపై ఎవరు విమర్శలు చేయకూడదనే ధోరణి బాగా ప్రబలడమే ఇందుకు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గత కొద్దిరోజులుగా జిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు అందరినీ విస్తుపోయేలా చేస్తున్నాయి. ముఖ్యంగా మంత్రులు కెఎస్.జవహర్, పైడికొండల మాణిక్యాలరావు తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మంత్రుల తీరుతో జిల్లాలో పొలిటికల్ వార్ రోజురోజుకు మరింత ముదురుతోంది. బిజెపికి చెందిన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ, మంత్రి పైడికొండల మాణిక్యాలరావుకు అక్కడ టిడిపి నాయకులకు మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటున్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్, మాణిక్యాలరావు మధ్య అసలు పొసగడం లేదు. నిన్నమొన్నటి వరకూ విమర్శలకు, ప్రతివిమర్శలకు విలేకరుల సమావేశాలను వేదికగా నాయకులు వ్యవహరించేవారు. ఇప్పుడు సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. సోషల్ మీడియా ఫేస్‌బుక్, వాట్సప్‌లను విమర్శలకు వేదికలుగా మార్చుకున్నారు. దీంతో ఇదికాస్తా ముదిరిపాకాన పడింది. తాడేపల్లిగూడెంలోని (4లో)

జన్మభూమిలో నిలదీతల పర్వం

లోపలి పేజీల్లో..


టి.నరసాపురం మండలం మర్రిగూడెంలో జరిగిన 'జన్మభూమి - మా ఊరు' సభ వద్ద ఆందోళన చేస్తున్న ఆదివాసీలు



8న జిల్లాలో సిఎం చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల ఎనిమిదో తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడిలో జరగనున్న జన్మభూమి సభలో ఆయన పాల్గొనున్నారు. సిఎం రానుండటంతో ఏర్పాట్లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. మంత్రి జవహర్, జిల్లా కలెక్టర్ భాస్కర్, ఎస్‌పి బుధవారం తాళ్లపూడి వెళ్లి సభ ప్రాంగణం, ఏర్పాట్లపై పరిశీలన చేశారు. అదే రోజు పోలవరం పర్యటనకు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ జిల్లాకు రానున్నట్లు సమాచారం. ఆయనతో పాటు పోలవరం పర్యటనలో పాల్గొని, తర్వాత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో సిఎం పాల్గొంటారా అనేది తెలియాల్సి ఉంది.

గీతోపదేశం



అర్హత ఉన్నోళ్లు... వాళ్లేనయ్యా మరి!

నేటి నుండి వంతులవారీ విధానం


పాలకొల్లు లాకులవద్ద సాగునీటి పరిస్థితిని పరిశీలిస్తున్న గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పొత్తూరి రామరాజు, ఇరిగేషన్ శాఖ ఎస్ఇ రఘునాథ్

12లో..

గోపాలకృష్ణమూర్తి సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సిపిఐ నాయకులు పోలా గోపాలకృష్ణమూర్తి జీవితాన్ని కార్యకర్తలందరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిపిఐ పట్టణ మాజీ కార్యదర్శి పోలా గోపాలకృష్ణమూర్తి 18వ వర్ధంతి సభ బుధవారం ఆ పార్టీ ఏలూరు ఏరియా కమిటీ కార్యదర్శి పుప్పాల కన్నబాబు అధ్యక్షతన స్థానిక స్ఫూర్తిభవన్‌లో జరిగింది. తొలుత గోపాలకృష్ణమూర్తి చిత్రపటానికి డేగా ప్రభాకర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఛాందసవాద కుటుంబంలో జన్మించిన గోపాలకృష్ణమూర్తి కమ్యూనిస్టు సిద్ధాంతాలను అధ్యయనం చేసి, తన పిల్లలకు ఆదర్శ వివాహాలు జరిపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. వర్ధంతి సభలో సిపిఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు, బండి వెంకటేశ్వరరావు, కె.కృష్ణమాచార్యులు, కన్నయ్య, సంజీవరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, సింహాచలం మాట్లాడుతూ గోపాల కృష్ణమూర్తి ఆదర్శప్రాయుడని కొనియాడారు. సభలో జగదాంబ, శారద, పెంటయ్య, భాస్కర్, భాగ్యలక్ష్మి, అమాలుద్దీన్ పాల్గొన్నారు.

ఆదేశాలు అతిక్రమిస్తే రౌడీషీట్ తెరుస్తాం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

హైకోర్టు, ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి ఎవరైనా కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై చట్టపరంగా రౌడీషీట్ తెరుస్తామని స్థానిక తహశీల్దార్ చవ్వాకుల ప్రసాద్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం గతేడాది కోడిపందేలు నిర్వహించిన బరులను వన్ టౌన్ సిఐ దేశింశెట్టి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేకంగా ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



సాయం అందిస్తున్న గ్రంధి శ్రీనివాసు

తోటివారికి సాయపడడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తోటివారికి సాయపడటంలోనే నిజమైన సంతృప్తి ఉందని, ఆపదలో ఉన్నవారిని ప్రతిఒక్కరూ ఆదుకోవాలని గ్రంధి శ్రీనివాసు మిత్ర మండలి సభ్యులు నల్లం రాంబాబు, ఉండపల్లి రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక విజయబాబు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బోణం దుర్గకు గ్రంధి శ్రీనివాసు మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం రూ.పది వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిరుపేదలను గుర్తించి వారికి తగిన ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు పేరిచర్ల సత్యనారాయణరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో సామాజిక సేవా కార్యక్రమాల పరిధిని విస్తృత పరుస్తామన్నారు. కార్యక్రమంలో కోయ తాతాజీ, మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.

5న లోకేష్ నరసాపురం రాక

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల ఐదో తేదీన నరసాపురం పట్టణానికి రానున్నట్లు ఎంఎల్ఎ కార్యాలయ వర్గాలు తెలిపాయి. గోదావరి తీరంలో నూతనంగా నిర్మించిన మలశుద్ధి ప్లాంట్, మొగల్తూరులో నిర్మించిన మంచినీటి చెరువును ప్రారంభించనున్నారని తెలిపాయి.

వెబ్ డిజైనింగ్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న విజయ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వెబ్ డిజైనింగ్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని బ్రైన్ విజన్ సొల్యూషన్స్ టెక్నికల్ హెడ్ బి.విజయ్ పేర్కొన్నారు. సర్ సిఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఐటి విభాగం ఆధ్వర్యంలో 'వెబ్ డిజైనింగ్ విత్ బూట్‌స్ట్రాప్ అండ్ యాంగ్యులర్ జెఎస్' అంశంపై బిటెక్ ఐటి విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడు రోజుల వర్క్‌షాపు ఆ కళాశాలలో బుధవారం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 400 కోట్ల మంది ఇంటర్‌నెట్ వినియోగదారులు ఉండగా వీరిలో 90 కోట్ల మంది సమాచార బదిలీ నిమిత్తం వెబ్‌సైట్లను వినియోగించుకుంటున్నారని చెప్పారు. భవిష్యత్తులో ప్రతిఒక్కరూ తమ అవసరాలకు వెబ్‌సైట్లను ఆశ్రయించక తప్పదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ జి.సాంబశివరావు మాట్లాడుతూ పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లుగా ఐటి విద్యార్థులు తగిన నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. దీనికి ఇలాంటి వర్క్‌షాపులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వర్క్‌షాపు కన్వీనర్ ఐటి విభాగాధిపతి ఎస్.కృష్ణారావు మాట్లాడుతూ ఈ రంగంలో ప్రావీణ్యత ఉన్న వారికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాని యువతకు స్ఫూర్తి



ఫ్లెక్సీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బుజ్జి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వంపై ఆధారపడకుండా దళిత కుటుంబంలో జన్మించి, తన స్వశక్తితో ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్‌ను నెలకొల్పిన నాని యువతకు స్ఫూర్తిగా నిలుస్తాడని స్థానిక ఎంఎల్ఎ బడేటి కోట రామారావు (బుజ్జి) చెప్పారు. లంకపేటలో బుధవారం రూ.15 లక్షల వ్యయంతో నాని నెలకొల్పిన కింగ్స్ ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్‌ను ఎంఎల్ఎ బుజ్జి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ యువతకు ఉపాధి సౌకర్యాలు కల్పించేందుకు 135 రకాల వృత్తుల్లో శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు చెప్పారు. యువత ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు జీవితంలో స్థిరపడేందుకు ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి కుటుంబం నెలకు రూ.పది వేలను సంపాదించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వృత్తి శిక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. యువత స్వయం ఉపాధి కార్యక్రమాల వైపు దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నిర్మలా కుమారి, కార్పొరేషన్ విప్ గూడవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు



బాధితురాలిని పరామర్శిస్తున్న బాలరాజు

ప్రజాశక్తి - పోలవరం

అధికారుల నిర్లక్ష్యంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వైసిపి మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మెట్లపుకోట గ్రామానికి రోడ్డు సదుపాయం లేదని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు గిరిజనులు విన్నవించుకున్నారని, ఏ ఒక్కరూ రోడ్డు రవాణా సౌకర్యాలపై శ్రద్ధ కనబరచలేదని పేర్కొన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన గిరిజనులు తామే స్వయంగా రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నిస్తే అటవీ శాఖాధికారులు అభ్యంతరాలు లేవనెత్తి రోడ్డు నిర్మాణానికి ఆటంకం కలిగించారన్నారు. గతంలో ఇదే మార్గంలో పలుమార్లు ట్రాక్టర్లు తిరగబడి గిరిజనులు గాయాలపాలైన సంఘటనలు చోటు చేసుకున్న ఏ ఒక్క అధికారి ఆ గ్రామం వైపు గానీ, రహదారుల నిర్మాణంపైన గానీ ఆసక్తి చూపలేదన్నారు. ఎటువంటి రికార్డులు లేని ట్రాక్టర్లతో రవాణా జరుపుతున్న రవాణా శాఖాధికారులు, పోలీసు శాఖ ట్రాక్టర్ యజమాని పైన గానీ, డ్రైవర్ పైనగానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై అధికారులు దృష్టి సారించి ఉంటే ప్రమాదం సంభవించేది కాదన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ ప్రాజెక్టుగా చెప్పుకుంటున్న పోలవరం బాగా ప్రసిద్ధి చెందిందని, అయితే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్టు గానీ, సివిల్ సర్జన్ గానీ లేకపోవడం బాధాకరమన్నారు. అనంతరం పోలవరం మండల వైసిపి అధ్యక్షులు బుగ్గా మురళీ కృష్ణ క్షతగాత్రులకు భోజన సదుపాయాలు కల్పించారు.

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఆకివీడు

పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు యువకులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక వెలమపేటకు చెందిన బొల్ల అభిరామ్, దుంపగడప గ్రామానికి చెందిన పులవర్తి సాయిలీలాగుప్త విలాసాలకు అలవాటు పడ్డారు. సులభమైన మార్గంలో డబ్బు సంపాదించాలని దొంగతనాలను ప్రవృత్తిగా ఎంచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో వీరిద్దరు చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ క్రమంలో మంగళవారం గొల్లలకోడేరు సెంటర్‌లో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా అటుగా వచ్చిన వీరిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం వెలుగు చూసింది. దీంతో వారి వద్దనుంచి 25 కాసుల బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలను, ఒక ద్విచక్రవాహనాన్ని, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.పది లక్షలు ఉంటాయని తెలిపారు.

ఫిబ్రవరి నాటికి ఇంటింటికీ కుళాయిలు

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో ఫిబ్రవరి నాటికి ఇంటింటికీ మంచినీటి కుళాయిలను మంజూరు చేస్తామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి కోట రామారావు (బుజ్జి) చెప్పారు. బుధవారం స్థానిక 38వ డివిజన్‌లో నిర్వహించిన జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో ఎంఎల్ఎ బుజ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగర ప్రజలకు రక్షిత నీటిని అందించడంతో పాటు ప్రతి ఇంటికీ అమృత పథకం కింద మంచినీటి కుళాయిల ఏర్పాటు ప్రక్రియను ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఏలూరు నియోజకవర్గంలో పేదలకు ఇళ్లు నిర్మించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుందన్నారు. ఇందులో భాగంగా 12 వేల ఇళ్లను నిర్మించే పనులు ఉగాది నుండి చురుకుగా సాగుతాయన్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన నిధులు విడుదల కానున్నాయన్నారు.

8 నుంచి సంక్రాంతి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల ఎనిమిదో తేదీ నుండి 15వ తేదీ వరకూ ఏలూరులో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 14వ సంక్రాంతి యువజనోత్సవాలను నిర్వహించనున్నట్లు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) నగర నాయకులు సిహెచ్.భరత్ తెలిపారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నగర కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, జూద క్రీడలకు వ్యతిరేకంగా ప్రభుత్వమే సంక్రాంతి రోజుల్లో ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలో కోడిపందేలు, జూద క్రీడలను ప్రోత్సహించడం సరికాదన్నారు. సంక్రాంతి పండుగ రోజుల్లో యువత దృష్టిని ఆరోగ్యకరమైన క్రీడల పట్ల మళ్లించేందుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు ఎనిమిదో తేదీ నుండి 13వ తేదీ వరకూ సిఆర్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేవారు 9494575998, 8500702095 నెంబర్లను సంప్రదించాలని కోరారు. అలాగే 12వ తేదీన కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొనేవారు 8143561809 సంప్రదించాలన్నారు. 13వ తేదీన కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించనున్న షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్‌లో పాల్గొనేవారు 8500702095 సంప్రదించాలని పేర్కొన్నారు. నగరంలో నిర్వహిస్తున్న యువజనోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

టిడిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

ప్రజాశక్తి - ఆకివీడు

తెలుగుదేశం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పివిఎల్ నరసింహరాజు పేర్కొన్నారు. ఆ పార్టీ చేపట్టిన గడప గడపకు వైసిపి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులు అభిమానులతో కలిసి మండలంలోని కుప్పనపూడి గ్రామంలో బుధవారం పర్యటించారు. అదే గ్రామంలో రాత్రికి పల్లెనిద్ర కార్యక్రమం ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు గుండ సుందర రామనాయుడు ప్రకటించారు. అనంతరం ఆయన గ్రామంలోని వంగవీటి మోహనరంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని సమస్యలు తీర్చలేదని పేరుకుపోయిన సమస్యలను తెలుసుకునేందుకే జగన్ ప్రజా సంకల్ప యాత్ర జరుపుతున్నారన్నారు.

అంధకారంలో పెద్దాసుపత్రి..!

జనరేటర్‌ను ఆన్ చేసేవారే కరవు?
అవస్థల్లో రోగులు


సెల్‌టార్చ్ వెలిగించిన క్షతగాత్రుని బంధువులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలోనే అత్యుత్తమ ఆసుపత్రిగా పురస్కారాన్ని అందుకున్న ఏలూరులోని జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో కరెంటు పోతే చాలా అంధకారం అలుముకుంటుంది. కరెంటు పోయిన తర్వాత జనరేటర్‌ను వేసేవారు లేక రోగులు, వైద్యులు, సిబ్బంది, అత్యవసర విభాగ సిబ్బంది ఇబ్బందులు పాలవుతున్నారు. మంగళవారం రాత్రి సమయంలో నగరంలో కొన్ని ప్రాంతాల్లో దాదాపుగా 30 నిమిషాలపాటు విద్యుత్ నిలిచిపోయింది. కాని ఈ అరగంట సమయంలో ఆసుపత్రిలో అత్యవసర విభాగాల కోసం ఏర్పాటు చేసిన రూ.20 లక్షల విలువైన జనరేటర్‌ను ఆన్‌చేసే ఉద్యోగి అందుబాటులో లేడు. అదే సమయంలో ఒక వ్యక్తి ప్రమాదానికి గురవ్వడంతో అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. విద్యుత్ లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది అతనికి వైద్యసేవలు అందించలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు సెల్‌ఫోన్‌లో టార్చ్‌లైట్ వేసి ఆ వెలుగులో రోగిని అరగంట సేపు కనిపెట్టుకుని ఉన్నారు. ఈ అరగంట సమయంలో ప్రమాదానికి గురైన రోగికి ఏదైనా జరిగితే ఎవరు జవాబుదారి అని కుటుంబసభ్యులు ప్రశ్నిస్తున్నారు. అత్యవసర విభాగం మాత్రమే కాకుండా ట్రామాకేర్ యూనిట్, ఐసియు, సాధారణ విభాగం, డయాలసిస్ విభాగం, శస్త్రచికిత్స అనంతరం రోగులను ఉంచే విభాగం, పరిపాలనా విభాగం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాలుగు రోజుల క్రితం ఆసుపత్రి విద్యుత్ మూడు ఫేస్‌ల్లో ఒక ఫేసు ఆగిపోవడంతో అత్యవసర విభాగానికి వచ్చే విద్యుత్ నిలిచిపోయింది. ఆ సమయంలో అందుబాటులో ఉండాల్సిన ఎలక్ట్రిషన్ దాదాపు గంటవరకూ విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు చేరుకోలేదు. అప్పుడు కూడా అత్యవసర విభాగానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇకనైనా ఉన్నతాధికారులు ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

హోమ్‌వర్క్ చేయలేదని..

తనపై దాడి జరిగిందంటూ 100కు సమాచారం - కలకలం రేపిన ఏడో తరగతి విద్యార్థి


బాలుడు నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

తనకు ఇచ్చిన హోం వర్క్ చేయలేదని ఉపాధ్యాయురాలు ఎక్కడ మందలిస్తుందోనని భయంతో తనపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారని పోలీసులకు ఓ బాలుడు సమాచారం అందించాడు. దీంతో తాడేపల్లిగూడెంలో కలకలం రేగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన దుర్గా ప్రసాద్, మహాలక్ష్మి దంపతుల కుమారుడు ఆర్.ఫణికుమార్ తాడేపల్లిగూడెంలోని తన నానమ్మ వద్ద ఉంటూ పాతూరులోని ఎస్‌విడి పబ్లిక్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. అయితే ఆ బాలుడు మూడురోజుల నుంచి ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్ చేయలేదు. దీంతో తాను పాఠశాలకు వెళ్తే వారు ఎక్కడ మందలిస్తారోనే భయంతో బుధవారం ఉదయం 100 నంబరుకు ఫోన్ చేశాడు. తనపై ఎవరో గుర్తు తెలియని దుండగులు దాడి చేశారని సమాచారం ఇచ్చాడు. దీంతో ఈ విషయం తెలుసుకున్న తాడేపల్లిగూడెం ఎస్ఐ ఆంజనేయులు హుటాహుటిన ఆ బాలుడి వద్దకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత బాలుడిని విచారించగా ఆ బాలుడిపై ఎవరు దాడి చేయలేదని, హోంవర్క్ చేయకపోవడంతో భయపడి అలా సమాచారం ఇచ్చాడని తెలిసింది. దీంతో ఆ బాలుడి నానమ్మను పాఠశాలకు పిలిపించిన పోలీసులు జరిగిన విషయాన్ని ఆమెకు తెలిపారు. మరోసారి బాలుడు ఇలా చేయకుండా తగిన విధంగా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అనుమానాస్పద రీతిలో వికలాంగుడు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఓ వికలాంగుడు అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. దీనిపై తాడేపల్లిగూడెం రూరల్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెదతాడేపల్లి గ్రామానికి చెందిన చుక్కాల సుబ్రహ్మణ్యం (35) రెండు నెలల క్రితం తన వ్యక్తిగత కారణాల రీత్యా జైపూర్ వెళ్లాడు. అక్కడ నుమచి ఈనెల రెండో తేదీ రాత్రి తాడేపల్లిగూడేనికి వచ్చాడు. అక్కడ నుంచి తన చెల్లెలు విజయరాణికి ఫోన్ చేశాడు. తాను ఇంటికి వస్తున్నానని సమాచారం ఇచ్చాడు. అయితే బుధవారం ఉదయమైనా రాకపోవడంతో ఆమె అతని కోసం ఎదురు చూస్తుండగా అతను మృతిచెందాడనే సమాచారం తెలిసింది. విజయరాణి ఇంటికి తన మూడు చక్రాల సైకిల్‌పై బయలుదేరిన సుబ్రహ్మణ్యం పెదతాడేపల్లిలోని బెస్ట్ కళాశాల సమీపంలోని రోడ్డు పక్కనున్న ఓ బోదెలో పడి మృతిచెంది కనిపించి ఉన్నాడని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ బి.శ్రీనివాస్ దీనిపై అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


సుబ్రహ్మణ్యం మృతదేహం

అమ్మానాన్న.. నన్ను క్షమించండి..!

రైలుకిందపడి యువకుడు ఆత్మహత్య - జరిమానా విధించడమే కారణం..!

ప్రజాశక్తి - పాలకొల్లు

'అమ్మ, నాన్న నేను చేసిన పనికి సిగ్గు పడుతున్నాను.. తల్లిదండ్రులను నేను అప్రతిష్టపాలు చేశాను.. తమ్ముడూ అమ్మానాన్నను, అక్కాబావను, వారి పిల్లలను బాగా చూసుకో' అంటూ ఓ యువకుడు తన ఆఖరి మాటలను అక్షరాలుగా మలిచాడు.. రైలుకింద పడి తనువు చాలించాడు. ఆ యువకుడు ఓ యువతిని ప్రేమించినందుకు స్థానిక పెద్దలు జరిమానా విధించడం వల్లే మృతిచెందాడని తెలుస్తోంది. దీనికి సంబంధించి రైల్వే పోలీసుల కథనం మేరకు..

ఆచంట మండలం వల్లూరుకు చెందిన మట్టా మణికంఠ మంగళవారం రాత్రి పాలకొల్లు రైల్వేగేటు వద్ద ఓ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన రైల్వే కీమెన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుని వద్ద పోలీసులకు ఓ ఉత్తరం లభించింది. ఆ ఉత్తరంలో తాను చేసిన పనికి సిగ్గు పడుతున్నానని, తల్లిదండ్రులను అప్రతిష్టపాలు చేశానని, తనను క్షమించాలని ఉత్తరంలో కోరాడు. తన తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని, అక్క, బావలను బాగా చూసుకోవాలని, అక్క కుమారుడును కూడా బాగా చూసుకోవాలని తమ్ముడిని కోరాడు. మణికంఠ వల్లూరుకు చెందిన ఓ యువతిని ప్రేమించాడని, దీనిపై పెద్దలు కొంతనగదు జరిమానా విధించారని, ఈ జరిమానా రెండ్రోజుల క్రితం మణికంఠ తల్లిదండ్రులు చెల్లించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ కేసును రైల్వే ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూదక్రీడలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సంక్రాంతి ముసుగులో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ దాసిరాజు, పాలకొల్లు రూరల్ ఎస్ఐ కోలా రజనీకుమార్ హెచ్చరించారు. మండలంలోని వడ్లవానిపాలెం, దగ్గులూరు, లంకలకోడేరు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించే బరులను పోలీసులు బుధవారం గుర్తించారు. ఈ సందర్భంగా స్థానికులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ స్థలాల్లో పందేలు నిర్వహిస్తే ఆయా గ్రామాల సర్పంచులపైనా, విఆర్ఓపైనా, పంచాయతీ కార్యదర్శులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రయివేటు స్థలాల్లో కోడిపందేలు నిర్వహిస్తే ఆ స్థల యజమానులపై పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెంటపాడు

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తాడేపల్లిగూడెం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన గంగుల సాయికుమార్ (26) తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం తన వ్యక్తిగత పనుల నిమిత్తం తాడేపల్లిగూడెం నుంచి రాచర్లలోని తన స్నేహితుని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. అతను దర్శిపర్రు సమీపంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పెంటపాడు ఎస్ఐ సత్యనారాయణ సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గల్లంతైన ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పెంటపాడు

కాలువలోకి బైక్‌తో సహా దూసుకెళ్లి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు.. పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామానికి గుండుమోగుల ఫణిసందీప్ (25), గుండుమోగుల అన్నవరం(26) ఇద్దరూ ఈనెల ఒకటో తేదీన అర్ధరాత్రి 11 గంటల సమయంలో దర్శిపర్రు నుండి రాచర్ల స్నేహితుడి ఇంటికి బయలుదేరారు. వారిద్దరూ దర్శిపర్రు వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లారు. ఈ సంఘటనలో ఇద్దరూ కాలువలో గల్లంతయ్యారు. దీంతో ఈ విషయాన్ని గమనించిన అక్కడివారు పోలీసులకు సమాచారం అందించడంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం వారిద్దరి మతదేహాలు దర్శిపర్రు ఆంజనేయస్వామి గుడి సమీపంలో కాలువలో లభించాయి. పెంటపాడు ఎస్ఐ ఆధ్వర్యంలో మృతదేహాలను వెలికితీశారు. వాటిని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ సుబ్రమణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

18 మంది జూదరుల అరెస్టు

ప్రజాశక్తి , ఉంగుటూరు

ఎ.గోకవరం పంచాయతీ పరిధి గోపరాజుపాడులో బుధవారం పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి రూ.1920 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చేబ్రోలు ఎస్ఐ తాడి వెంకట నాగరాజు వెల్లడించారు.

నల్లజర్ల : నల్లజర్ల మండలం ముసుళ్లగుంట గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి 13 మందిని అరెస్టు చేశారు. వారినుంచి రూ.21,300 నగదును, ఆరు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

నిడమర్రు: పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరు జూదరులను అరెస్టు చేశారు. మండలంలోని ఛానమల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు జూదరులను అరెస్టు చేశారు. వారినుంచి రూ.1950 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి టి.నరసాపురం

మండలంలో సంక్రాంతి పండుగ సమయాల్లో కోడిపందేలను అడ్డుకునే క్రమంలో భాగంగా మండలంలోని టి.నరసాపురం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై బుధవారం బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ రాంబాబు తెలిపారు. వారిని స్థానిక తహశీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

14 మందిపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని వెలగపాడు, వీరభద్రవరానికి చెందిన 14 మందిపై రెండు అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.రాంబాబు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెలగపాడులో గతేడాది డిసెంబరు 31వ తేదీ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో కేకు కట్‌చేస్తున్న సమయంలో శీలం సాయివినయ్ మరో ఆరుగురు మోటారు వాహనాలపై వచ్చి అల్లరి చేయడమే కాకుండా, తమను కులం పేరుతో దూషించారని, కొట్టారని గ్రామానికి చెందిన మల్లపు మేరీ, కరిపోతు రాజు, బొడ్డు విజయకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై, అదే గ్రామంలో డిసెంబరు 31న రాత్రి ఉత్సవాలు చేసుకుంటున్న ఉమ్మడి గంగరాజు మరో ఆరుగురు వచ్చి తమను కులంపేరుతో దూషించారని లింగాల నాగమణి, గెడ్డం బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో ఏడుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రూ.పది కోట్లతో ఆట స్థలాల అభివృద్ధి

(మొదటి పేజీ నుంచి)

ఎన్ఆర్ఐల సహకారంతో డిజిటల్ తరగతిగదులు నిర్మించడం జరుగుతుందని చెప్పారు. ఇందులో అయ్యే ఖర్చులో 60 వేల రూపాయలను స్థానిక దాతలు, పూర్వవిద్యార్థుల ద్వారా సేకరించి పూర్తిచేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిపరుస్తుందన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో లేని ఎన్నో మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతీపాఠశాలలో విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలతోపాటు క్రీడా ప్రాంగణాలను కూడా ప్రభుత్వం అభివృద్ధి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచుతుందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ విద్యారంగానికి ఇన్ని నిధులు కేటాయించి అభివృద్ధి పరిచిందిలేదన్నారు. తొలుత జెడ్పి ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, కబడ్డీ, వాలీబాల్ కోర్టులను రాష్ట్రమంత్రి కెఎస్.జవహర్, మాజీ మంత్రి పీతల సుజాత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి పీతల సుజాత,. ఎంపిపి మద్దిపాటి సుబ్బలక్ష్మి, సర్పంచులు, అమృతరావు, దివ్యభారతి, మండల ప్రత్యేకాధికారి, డిఎఫ్ఓ రామకృష్ణ, ఎంపిడిఓ మనోజ్, తహశీల్దార్ నరసింహరాజు, టిడిపి నాయకులు మద్దికోటి నాగేశ్వరరావు, రామకృష్ణంరాజు, పాల్గొన్నారు.

సోషల్ మీడియా దుమారం..!

(మొదటి పేజీ నుంచి)

ముగ్గురు టిడిపి నాయకులపై మంత్రి కేసుపెట్టారని బొలిశెట్టి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తమపైనా సోషల్‌మీడియాలో మంత్రి విమర్శలు చేశారని ఆధారాలు ఉన్నాయని తమపై కేసు నమోదైతే తాము మంత్రి మాణిక్యాలరావుపై కేసు పెడతామని హెచ్చరించారు. దీంతో సోషల్ మీడియా వార్ మరింత ఉధృతమవుతోంది. తాజాగా కొవ్వూరు ఎంఎల్ఎ మంత్రి జవహర్ ఇదే రూటులో వెళ్లారు. తనకు అనుకూలంగా లేని టిడిపి నాయకులు సోషల్ మీడియాలో వ్యతిరేక పోస్టులు పెడుతున్నారంటూ పోలీస్ కేసు పెట్టారు. ఇది పెద్ద వివాదంగా మారింది. దీంతో మంత్రికి వ్యతిరేకంగా టిడిపి నాయకులు ఆందోళనలు నిర్వహించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులకు మంత్రులు ఈ విధంగా స్పందించడం ఏమిటో జనానికి అర్థంకాని పరిస్థితి నెలకొంది.

విమర్శలు తట్టుకోలేని పరిస్థితికి ప్రజాప్రతినిధులు

అధికారంలో ఉన్నామన్న అహంకారమో.. లేక తామే సర్వశక్తిమంతులమన్న అభిప్రాయమో తెలీదుగానీ ఇటీవల జిల్లాలోని ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ మాట వినకపోతే పోలీసులు, అధికారులపై సైతం దాడులకు దిగడం ఇప్పటి వరకూ చూశామని, తణుకు ఎంఎల్ఎ ఆరిమెల్లి రాధాకృష్ణ, దెందులూరు ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్ పోలీసుల పట్ల వ్యవహరించిన తీరే అందుకు నిదర్శనం. ఇప్పుడు అదే తీరు రాజకీయ విమర్శలు చేసేవారిపై సైతం కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. తమకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిపై కేసులు పెట్టడం ప్రారంభమైంది. ఇలా భయపెడితే వేరే వారు తమపై వ్యతిరేక పోస్టులు పెట్టారన్న బెదిరింపు ప్రక్రిలో భాగంగానే ఈవిధంగా చేస్తున్నారన్న చర్చ సాగుతోంది. రాజకీయాల్లో ఉన్నవారికి విమర్శలు, పొగడ్తలు సర్వసాధారణం. కానీ జిల్లాలోని ప్రజాప్రతినిధులు విమర్శలను అసలు ఏమాత్రమూ తట్టుకోలేకపోతున్నారు. తాము చేసిందే ఒప్పు అన్నట్లు పరిస్థితి తయారైంది. దీంతో సొంత పార్టీవారిపై సైతం కేసులు పెట్టేపరిస్థితికి దిగజారుడు వ్యవహారాలు కొనసాగుతున్నాయి. అందుకు తాడేపల్లిగూడెం, కొవ్వూరులో జరిగిన ఉదంతాలే నిదర్శనం. ఇది భావప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకర్గంలో అభివృద్ధి జరగడం లేదని ఎవరైనా పోస్టులు పెడితే కేసుపెట్టిన అశ్చర్యపోనకర్లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మాటవినకపోతే అధికారులపై దాడులు చేయడం, వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెట్టడం వంటి పరిణామాలతో జిల్లా రాజకీయాలు పక్కదారి పడుతున్నాయన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ముమ్మందు మాట్లాడే స్వేచ్ఛకు సైతం కళ్లెం వేయాలని చూస్తారేమోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంత్రుల స్థాయిలో ఉన్న వారు సోషల్‌మీడియా పోస్టులపై కేసులు పెట్టడంపై సర్వత్రా చర్చ కొనసాగుతోంది.

5న తాడేపల్లిగూడెంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

తాడేపల్లిగూడెంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర మహాసభలు మొట్ట మొదటిసారిగా జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 10, 11, 12 తేదీల్లో భీమవరంలో జరగనున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో ప్రజాసమస్యలపై నిర్వహించే పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర మహాసభలకు సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో జరిగే ఈ మహాసభల విజయవంతానికి తాడేపల్లి గూడెంలోని సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాకమిటీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పేరుపాలెంసౌత్‌లో 'జన్మభూమి' రసాభాస

ఎంఎల్ఎను అడ్డుకున్న రైతులు - నాయకులకు, రైతులకు మధ్య తోపులాట

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం సొసైటీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలంటూ పేరుపాలెం సౌత్‌లో నిర్వహించిన జన్మభూమి–మా ఊరు కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్ఎ బండారు మాధవనాయుడును రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంలో పోలీసులు రంగంలోకిదిగి అత్యుత్సాహం ప్రదర్శించారు. రైతులను పక్కకు నెట్టి ఎంఎల్ఎను లోపలికి పంపారు. అనంతరం రైతులను సభాస్థలిలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో నాయకులకు, రైతులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సమయంలో పోలీసులు కల్పించుకుని ఇరువురినీ విడదీశారు. ఇది గమనించిన ఎంఎల్ఎ మాధవనాయుడు రైతులను లోపలికి పంపాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం రైతులు లోపలికి వచ్చి ఎంఎల్ఎతో మాట్లాడారు. సొసైటీపై 642 మంది రైతులు ఆధారపడి ఉన్నారని, తమ సమస్యను పరిష్కరించాలని కోరి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ విచారణ పూర్తయిన అనంతరం దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎంఎల్ఎతో మాట్లాడిన వారిలో రైతులు మేళం గాంధీ, ఓసూరి రాంబాబు, అందే సత్యనారాయణ, కవురు శ్రీనివాస్, పలువురు రైతులు ఉన్నారు.




ఎంఎల్ఎను అడ్డుకున్న రైతులు

గన్నవరం నుంచి విమానాలు బయలుదేరు వేళలు




న్యూఢిల్లీకి	సమయం	వారం
ఎయిరిండియా	09.05	ప్రతిరోజూ
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
ఎయిరిండియా	20.40	ప్రతిరోజూ
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	09.35	ప్రతిరోజూ
ఎయిరిండియా	13.20	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజూ
ట్రూజెట్	21.55	ప్రతిరోజూ
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.55	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు
చెన్నైకు		
ట్రూజెట్	07.55	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	16.10	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు(వయా బెంగుళూరు)
తిరుపతికి		
ఎయరిండియా	07.55	బుధవారం మినహా
విశాఖపట్నానికి		
ఎయిరిండియా	10.55	బుధవారం మినహా
ఎయిరిండియా	15.35	బుధవారం మాత్రమే

కోడి గుడ్ల ధరలు



విజయవాడ	రూ. 3.75
హైదరాబాద్	రూ. 3.83
ప.గోదావరి	రూ. 3.75
తూ.గోదావరి	రూ. 3.75
విశాఖ	రూ. 3.80
చిత్తూరు	రూ 3.88
చెన్నై	రూ. 3.95
నామకల్	రూ 3.75



బులియన్ మార్కెట్

24 క్యారెట్లు : 3,004గ్రాము) : 30,040 (10గ్రా)

22 క్యారెట్లు : 2,816 (గ్రాము) : 28,160 (10గ్రా)

వెండి : 39.11(గ్రాము) : 39,110 (కిలో)

రైల్వే టైమ్‌టేబుల్

ఏలూరు నుంచి

రాజమండ్రి వైపు

రైలు నెం.	రైలు పేరు	వచ్చు సమయం	వెళ్లుసమయం
12728	గోదావరి-హైదరాబాద్-విశాఖ	00.06	00.07
12740	గరీబ్‌రథ్-సికింద్రాబాద్-విశాఖ	02.41	02.42
18048	అమరావతి:వాస్కోడిగామా-హౌరా(సో,బు,శు,శ)	03.46	03.47
12738	గౌతమి-సికింద్రాబాద్-కాకినాడ పోర్ట్	04.06	04.07
17487	తిరుమల-తిరుపతి-విశాఖ	04.21	04.22
18510	ఎక్స్‌ప్రెస్-హెచ్-ఎస్ నాందేడ్-విశాఖ (సో,గు,శు)	04.41	04.42
18310	నాగావళి-నాందేడ్-సంబల్‌పూర్ (మ, బు, ఆది)	04.41	04.42
67300	ప్యాసింజర్-విజయవాడ-రాజమండ్రి	05.48	05.50
12718	రత్నాచల్-విజయవాడ-విశాఖ	06.51	06.52
12840	మెయిల్ -చెన్నయ్-హౌరా	07.26	07.27
18464	ప్రశాంతి-బెంగులూర్-భువనేశ్వర్	07.41	07.42
12862	లింక్-నిజాముద్దీన్-విశాఖ	07.51	07.52
13352	బొకారో-అలెప్పి-టాటానగర్	08.16	08.17
57225	ప్యాసింజర్-విజయవాడ-విశాఖ	09.47	09.48
12864	యశ్వంత్‌పూర్- యశ్వంత్‌పూర్-హౌరా	10.26	10.27
17239	సింహాద్రి-గుంటూరు-విశాఖ	10.34	10.35
22416	ఎపి ఎక్స్‌ప్రెస్ న్యూఢిల్లీ-విశాఖ	13.31	13.32
57257	ప్యాసింజర్-తిరుపతి-కాకినాడ	13.59	14.00
12806	జన్మభూమి-సికింద్రాబాద్-విశాఖ	14.27	14.28
11019	కోణార్క్-ముంబై-భువనేశ్వర్	15.08	15.09
17205	షిర్డీ- సాయినగర్ షిర్డీ-కాకినాడ టౌన్ (సో,బు,శు)	16.25	16.27
18646	ఈస్ట్‌కోస్ట్-హైదరాబాద్-హౌరా	17.38	17.39
57231	ప్యాసింజర్-విజయవాడ-కాకినాడ పోర్ట్	18.33	18.35
67261	ప్యాసింజర్-విజవాడ-రాజమండ్రి	19.46	19.47
57271	ప్యాసింజర్-విజయవాడ-రాయగడ	22.16	22.17
12704	ఫలక్‌నామా-సికింద్రాబాద్-హౌరా	22.26	22.27

విజయవాడ వైపు

రైలు నెం.	రైలు పేరు	వచ్చు సమయం	వెళ్లుసమయం
12739	గరీబ్‌రథ్-విశాఖ-సికింద్రాబాద్	00.44	00.45
12703	ఫలక్‌నామా-హౌరా-సికింద్రాబాద్	01.39	01.40
11020	కోణార్క్-భువనేశ్వర్-ముంబై	03.06	03.07
22883	పూరీ-పూరీ-యశ్వంత్‌పూర్(శని)	03,34	03.35
67262	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	05.40	05.41
57272	ప్యాసింజర్-రాయగడ-విజయవాడ	07.04	07.05
57232	ప్యాసింజర్-కాకినాడపోర్ట్-విజయవాడ	08.00	08.01
17206	షిర్డీ ఎక్స్‌ప్రెస్-కాకినాడ-షిర్డీ (సో,బు,శని)	08.31	08.32
18645	ఈస్ట్‌కోస్ట్-హౌరా-హైదరాబాద్	09.25	09.26
12805	జన్మభూమి-విశాఖ-సికింద్రాబాద్	10.28	10.29
57258	ప్యాసింజర్-కాకినాడ-తిరుపతి	11.31	11.32
17240	సింహాద్రి-విశాఖ-గుంటూరు	12.08	12.09
22415	ఎక్స్‌ప్రెస్-విశాఖ - న్యూఢిల్లీ	12.26	12.27
13351	బొకారో-టాటానగర్-అలెప్పి	14.36	14.37
12863	హౌరా-హౌరా-యశ్వంత్‌పూర్	15.02	15.03
57226	ప్యాసింజర్-విశాఖప్నటం-విజయవాడ	15.50	15.52
12717	రత్నాచల్-విశాఖ-విజయవాడ	16.51	16.52
18047	అమరావతి-హౌరా-వాస్కోడిగామా(మ,బు,శు,ఆది)	16.58	16.59
18463	ప్రశాంతి-భువనేశ్వర్-బెంగుళూర్	17.31	17.32
17488	తిరుమల-విశాఖ-తిరుపతి	18.41	18.42
12861	లింక్-విశాఖ-నిజాముద్దీన్	19.33	19.34
67229	ప్యాసింజర్-రాజమండ్రి-విజయవాడ	19.45	19.50
12727	గోదావరి-విశాఖ-హైదరాబాద్	22.01	22.02
12737	గౌతమి-కాకినాడపోర్ట్-సికింద్రాబాద్	22.56	22.57
18309	సంబల్‌పూర్-నాందేడ్(సో,మ,ఆది)	23.47	23.48
18509	ఎక్స్‌ప్రెస్-విశాఖ-నాందేడ్(మ,బు,శని)	23.47	23.48

డంపింగ్ యార్డును తరలించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డిఎన్ఆర్ కళాశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్న డంపింగ్ యార్డును వేరే చోటుకు తరలించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.కార్తిక్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొన్న కార్తిక్ మాట్లాడుతూ డిఎన్ఆర్ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థులున్నారని, ఈ విద్యా సంస్థలకు సమీపంలో డంపింగ్ యార్డు ఉండడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని చెప్పారు. తరగతుల నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పందించి డంపింగ్ యార్డును వేరేచోటుకు తరలించాలని లేని పక్షంలో విద్యార్థులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పెద్దిరాజు, హనుమ, దొరబాబు, సూర్య పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్



ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని రాయకుదురు, చింతలకోటిగరువు గొంతేరు మురుగు కాలువపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్‌ను నిర్వహించారు. పథకం అధ్యక్షులు ఇర్రింకి మాధవ పురుషోత్తం, ముప్పన వెంకట సుబ్బారావు రైతుల ఆధ్వర్యంలో జలవనరుల అభివృద్ధి శాఖాధికారుల డిఇ ఎన్.శేషగిరిరావు, ఎఇ వివిఎల్‌జి శాస్త్రి పర్యవేక్షణలో బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో మరికొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో ఈ పథకం ద్వారా సుమారు పదిహేను వందల ఎకరాలకు సాగునీటి కొరత తీరనున్నట్లు పేర్కొన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, నేటి టిడిపి ప్రభుత్వంలో ఉన్న భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) హామీ మేరకు ఈ పథకం నిర్మాణం పూర్తయ్యింది. రాయకుదురు-1లో భాగంగా చింతలకోటిగరువులో రూ.4.40 కోట్లు, రాయకుదురు-2 నందు రూ.2.5 కోట్లు నిధులు కేటాయించి పథకం పనులను పూర్తి చేసినట్లు చెప్పారు. ఆరు ఎకరాలకు క్యూసెక్కు చొప్పున రాయకుదురు-1 నందు మూడు 50 హెచ్‌పి మోటర్లను, రాయకుదురు-2 నందు రెండు 40 హెచ్‌పి మోటార్ల సహాయంతో నీటిని పంపు చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు దాసరి ఏసు నాయుడు, అందే ఉమమహేశ్వరరావు, దివ్విరాంబాబు, కాగిత చిన్నారావు, పీతల బాబు, నార్ని సత్తిబాబు, కాగిత చిన్నయ్య, ఇర్రింకి లక్ష్మణ్, చెంగళ్వ పరదేశి, మల్లాది రామారావులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం



నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కులతత్వ నిర్మూలన, స్త్రీ సమానత్వ సాధన కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సిఐటియు నాయకులు బి.వి.వర్మ పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే 187వ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని వెంప గ్రామంలో ఆమె చిత్రపటానికి కెవిపిఎస్, సిఐటియు, ప్రజా సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.వి.వర్మ మాట్లాడుతూ బాల్యవివాహాలకు వ్యతిరేకంగా వితంతు పునర్వివాహాలను సావిత్రిబాయి పూలే నూట యాభై ఏళ్ల క్రితమే నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. నిమ్నవర్గాల ప్రజలను, అణచివేతకు గురవుతున్న స్త్రీలను అక్కున చేర్చుకుని కుల దురహంకారానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. అంతే కాకుండా మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయిపై అగ్రవర్ణ ఛాందసవాదులు దాడిచేసినప్పటికీ ఎంతో ఓర్పుతో స్త్రీ విద్యను నిషేధించిన ఆ రోజుల్లోనే మహిళలకు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. కెవిపిఎస్ డివిజన్ కన్వీనర్ ఇంజేటి శ్రీనివాసు మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులపై దాడులు జరుగుతున్నప్పటికీ చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో కులతత్వంపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు. కార్యక్రమంలో టి.సుధాకర్, సిఐటియు నాయకులు బొక్కా రాంబాబు, డివైఎఫ్ఐ నాయకులు ఇంజేటి రవి, రైతు సంఘ నాయకులు కోడి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాలకోడేరు : విస్సాకోడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు జి.మణిని ఘనంగా సత్కరించారు. భారత దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త, ఉద్యమ కారిణి, స్త్రీల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెఎస్.చంద్రశేఖర్ కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెఎస్ఎన్.ప్రసాద్, సిహెచ్.ప్రసాదరావు, జి.గణేశ్వరి, జి.పద్మజ, రాంభద్రిరాజు, ఎం.లలిత, కె.రాజ్యలక్ష్మి, సత్యప్రియ, అంజయ్య, ఉదయ శంకరుడు, చంద్రశేఖర్, వీర్రాజు పాల్గొన్నారు.

ఏలూరు : సంఘసంస్కర్త, ప్రప్రథమ ఉపాధ్యాయురాలు, రచయిత్రి, నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే 187వ జయంతిని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.జగదాంబ, జి.శారద మాట్లాడుతూ సావిత్రిబాయి మహిళల విద్య కోసం ఎనలేని కృషి చేసిందని కొనియాడారు. విద్యతోనే స్త్రీకి విముక్తి లభిస్తుందని చెప్పారని, ఆమె ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్.రోజా, రామలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఉప్పులూరి లక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.

చింతలపూడి : తెలుగుదేశం ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి కృషి చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. చింతలపూడి పట్టణంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఎ పీతల సుజాత, మంత్రి జవహర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జవహర్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తోందని స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తోందన్నారు. అనంతరం ఎంఎల్ఎ పీతల సుజాత మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.


'సమస్యల పరిష్కార వేదిక 'జన్మభూమి - మాఊరు"

ప్రజాశక్తి - వీరవాసరం

తన నియోజవర్గంలో అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయించినట్లు భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. జన్మభూమి మాఊరు కార్యక్రమం బుధవారం కొణితివాడ, మడుగుపోలవరం, నేలపోగుల గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ మండలంలోని 589 మంది పింఛన్లకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ప్రత్యేకించి మండలానికి 650 పెన్షన్లను కేటాయించామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, ఎంపిపి కవురు శ్రీనివాస్, సర్పంచ్‌లు యరకరాజు చినబాబు, మంద్రు విజయబాబు, ఎల్‌వి.సత్యనారాయణ, తహశీల్దార్ ఎం.ముక్కంటి, ఎంపిడిఒ పి.జగదాంబ, పిఆర్ ఎఇ సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేకాధికారి ఎన్.శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు పోలిశెట్టి సత్యనారాయణ (దాసు), కొణితివాడ, తోలేరు నీటి సంఘాల అధ్యక్షులు యరకరాజు పెదబాబు, భోగిరెడ్డి గోవిందరావు, అండలూరు సహకారం సంఘం అధ్యక్షులు పంజా చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రజలు సమస్యలు పరిష్కారించేందుకే జన్మభూమి మా

ఉండి : మండలంలోని ఉనుదుర్రు,



మాట్లాడుతున్న ఎంఎల్ఎ శివ

యండగండి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శివ మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యండగండి సర్పంచి సిహెచ్.విజయ, ఎఎంసి వైస్ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసు, జెడ్‌పిటిసి సభ్యులు కె.వెంకట సత్యతులసి, ఉనుదుర్రు సర్పంచి, ఎంఆర్ఓ వై.దుర్గాకిషోర్, ఎంపిపి రెడ్డియ్య పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆ విధంగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని స్థానిక ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మండలం పరిధిలోని వేంద్ర, కుమదవల్లి గ్రామాల్లో ఉప సర్పంచ్‌లు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), భూపతిరాజు వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో జన్మభూమి మాఊరు కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎంఎల్ఎ శివ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా జన్మభూమి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నేతల బేబి, సర్పంచ్‌లు విప్పర్తి స్వర్ణ, చిట్టి మరియ, మాజీ ఎంపిపి పాలా వెంకట చలపతి, టిడిపి మండల అధ్యక్షులు కొత్తపల్లి గోపాలకృష్ణంరాజు, జన్మభూమి ప్రత్యేక అధికారి బిఎల్‌వి.ప్రసాద్, తహశీల్దార్ జి.రత్నమణి, ఎంపిడిఒ పి.వెంకటరత్నం, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి మాఊరు కార్యక్రమం చక్కని వేదికని స్థానిక ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలోని 4 నుండి 8వ వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొటికలపూడి గోవిందరావు, ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

కోడిపందేలను నిరసిస్తూ డివైఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సంక్రాంతి సంప్రదాయాల పేరుతో కోడిపందేలను ప్రోత్సహిస్తున్న ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలను ఖండిస్తూ డివైఎఫ్ఐ, వెంప గ్రామస్తుల ఆధ్వర్యంలో స్థానిక తాలుకా ఆఫీసు రోడ్డులో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అల్లూరి అరుణ్ మాట్లాడుతూ జూద క్రీడలకు స్వస్తి పలికి ప్రజా కళలను, క్రీడలను ప్రభుత్వం నిర్వహిస్తే మట్టిలో మాణిక్యాలను వెలికి తీసినట్లు అవుతుందని హితవు పలికారు. యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిపందేలు, జూద క్రీడలను నిర్వహించకుండా పోలీసు యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలన్నారు. డివైఎఫ్ఐ నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల పదో తేదీన స్థానిక మెంటేవారితోటలో వండర్‌కిడ్స్ గ్రౌండ్‌లో దేహదారుఢ్యం పోటీలు, 12, 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు, 15వ తేదీ ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోడి సత్యనారాయణ, వెంప గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలను నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ చిట్టూరి రామచంద్రరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఈలంపూడి గ్రామంలో హైకోర్టు, ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా జూద క్రీడలను మానుకోవాలని హితవుపలికారు. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

డంపింగ్ యార్డుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని డంపింగ్ యార్డుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మండల శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులో నిర్మిస్తున్న డంపింగ్ యార్డు పనులను సర్పంచ్ గాదిరాజు చంద్రవతితో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా కాంట్రాక్టర్లకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. డంపింగ్ యార్డు పనులు చురుగ్గా సాగుతున్నాయని, త్వరలోనే నిర్మాణం పూర్తి అవుతుందని పేర్కొన్నారు. 14 గ్రామాల్లో డంపింగ్ యార్డుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సర్పంచ్ చంద్రవతి మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ శివరామరాజు సహకారంతో నిర్మాణం చేపట్టామన్నారు. ఎంఎల్ఎ ప్రత్యేక నిధులను గ్రామాభివృద్ధికి కేటాయిస్తున్నారని చెప్పారు. వీరి వెంట గాదిరాజు రాంబాబు ఉన్నారు.

'అవినీతి కూపంలో టిడిపి ప్రభుత్వం'

ప్రజాశక్తి - పాలకోడేరు

టిడిపి ప్రభుత్వం అవినీతికూపంలో కూరుకుపోయిందని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పివిఎల్.నరసింహరాజు పిలుపునిచ్చారు. మండలం పరిధిలోని కోరుకొల్లులో ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహరాజు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం పేదలకు లేనిపోని హామీలు ఇచ్చి వారిని నట్టేట ముంచిందని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా యూత్ విభాగ అధ్యక్షులు మంతెన యోగేంద్ర కుమార్ (బాబు), వర్మ, మాజీ సర్పంచ్ నరసింహరాజు, బంకు చంటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పశ్చిమ గోదావరి
గురువారం 4
జనవరి 2018

కల్తీ.. కలవరం..!

పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు - ప్రజలు అనారోగ్యాల పాలు

తెల్లనివన్నీ పాలు కాదు నల్లనివన్నీ నీళ్లు కాదు అన్న చందంగా నేడు అన్నింటా కల్తీ రాజ్యమేలుతోంది. ఆహార స్వచ్ఛత అనే పదానికి అర్థం లేకుండా చేస్తున్నారు కల్తీరాయుళ్లు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ అంతా రెడీ టూ ఈట్ పేరుతో కల్తీ ఆహార పదార్థాలను లాగించేస్తున్నారు. ఎటువంటి ఆహారం తింటున్నామో ఎవరూ పట్టించుకోవడం లేదు. అవసరానికి ఏది అందుబాటులో ఉంటే అది తినడం తప్ప ఎంతవరకూ అవి ఆరోగ్యకరం అనే విషయాన్ని గుర్తించడం లేదు. దీంతో ఆరోగ్యం అటకెక్కుతోంది. ఒక్క పాలే కాదు, తేనె, నెయ్యి, మజ్జిగ, పాస్ట్‌ఫుడ్స్ ఇలా ఒకటేమిటి కాదేది కల్తీకి అనర్హం అన్న చందంగా కల్తీరాయుళ్లు రెచ్చిపోతున్నారు.



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం అర్బన్

పట్టణ ప్రాంతాల్లో నగర జీవనం పాశ్చాత్య ధోరణి వైపు పరుగులు పెడుతోంది. ఏ శుభకార్యం జరిగినా, బంధువులొచ్చినా ఏర్పాటు చేసే మెనూలో రెడీ టూ ఈట్ ఉత్పత్తులకే మొదటి స్థానం. ఐస్‌క్రీం, కేక్, బర్గర్, మాంసాహారం, చైనీస్ స్టైల్ ఇలాంటి ఆహార ఉత్పత్తులను చూస్తే నేటితరం ఎగిరి గంతేస్తారు. ఇవన్నీ ప్యాకింగ్ రూపంలో ఉండడంతో అంత ఆరోగ్యం కాదని చెబుతున్నారు వైద్య నిపుణులు. ఎందుకంటే మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రొసెసింగ్ అనుమతితో ఇచ్చే ప్రొడక్ట్ గుర్తింపు ఈ ప్యాకింగ్‌లపై ఎక్కడా కనిపించదు.

ఐస్‌క్రీం, తేనె, పాలతో పాటు తీపి వస్తువులు నిల్వ ఉంచేవి రెడీ టూ ఈట్ కిందకే వస్తాయి. వాటిలో కలిసే రసాయనాలు నిబంధనలు అనుసరించి మోతాదు ఉంటే నష్టం లేదు. కాని వ్యాపారుల మధ్య పోటీని తట్టుకోడానికి రంగు, రుచి కోసం అనుమతులేని రసాయనాలను వాడుతున్నారు. వీటి వల్ల పిల్లలు, గర్భిణులు, ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారు. కల్తీ వ్యాపారులపై ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరించడంతో కల్తీ రాయుళ్ల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది.

ఇటువంటి ప్యాకింగ్ ఆహార పదార్థాల్లో అధికంగా వెనిగర్, అస్కార్బిక్ యాసిడ్, మెటానియల్ ఎల్లో, ఎసిటిక్ యాసిడ్ వంటి రసాయనాలు అధికంగా ఉన్నట్లు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ సంస్థ తెల్చిచెప్పింది. ఇవి మోతాదు మించడం వల్ల మానసిక, ఉదర సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.


పాలల్లో రసాయనాలు కలుపుతున్న వైనం




రసాయనాలతో కూడిన కలర్స్‌ను వినియోగిస్తున్న వైనం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ఏ వస్తువునైనా కొనే ముందు దానిపై ఉన్న లేబుల్ చదవాలి.
- పీచు పదార్థాన్ని గమనించాలి.
- ఏ ఆహార పదార్థమైనా ప్యాకింగ్ చేస్తే తయారీ తేదీలతో పాటు ఎంక్వయిరీ తేదీని నిర్ధారిస్తారు. నిర్ణీత తేదీ ముందే తీసుకోవాలి.
- క్లాస్-2 ప్రిజర్వేటివ్ చాలా ప్రమాదకరం. ఎక్కువ కాలం నిల్వ కోసం వాడే ఈ -211 వాడితే జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

కె.శివప్రసాద్, సూపరింటెండెంట్, తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి



రసాయనాల ప్రభావం కిడ్నీ ఫెల్యూర్‌కు దారి తీస్తుంది. ఈ రసాయనాల్లో ఉండే మెర్క్యూరీ, కాపర్, సెలీనియం వంటి ఘాడత కలిగిన పదార్థాల ద్వారా కిడ్నీలు కలుషితమవుతాయి. మానసిక, ఉదర సంబంధిత కేన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పిల్లల్లో ఎదుగుదల క్షీణిస్తుంది. వీలైనంత వరకూ ఇలాంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం మంచిది.

ఈ రహదారి.. ప్రమాదాల సవారి..

అడుగడుగునా గోతులు - ప్రమాదాలబారిన ప్రయాణికులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు - భీమవరం, పాలకొల్లు - నరసాపురం, పాలకొల్లు - మార్టేరు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడి నానా ఇబ్బంది పడుతున్నారు. పాలకొల్లు - మార్టేరు రహదారికి ఏటా మరమ్మతులు చేస్తున్నా నాణ్యతాలోపాల కారణంగా అడుగడుగుకూ గొయ్యి ఏర్పడుతోంది. దీంతో రాత్రి సమయాల్లోనే కాకుండా పగలు కూడా గోతుల్లో పడి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మూడు రోజుల కిందట వేడంగి సమీపంలో ఎదురుగా వస్తున్న లారీలు ఢీకొనడంతో రెండు లారీలు నుజ్జునుజ్జయ్యాయి. గత నెలలో భగ్గేశ్వరం రోడ్డులో రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మృత్యువాతపడ్డారు. సోమవారం రాత్రి కూడా భగ్గేశ్వరం వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గొయ్యిని తప్పించబోయి పక్కనున్న వృద్ధుడిని ఢీకొనడంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇలా వరుస సంఘటనలు జరుగుతున్నా కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి. పాలకొల్లు, నరసాపురం రహదారిలో దిగమర్రు వరకూ రోడ్డు అధ్వానంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దిగమర్రు నుంచి నరసాపురం వరకూ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. అవికూడా వేగంగా జరగకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకొల్లు, మార్టేరు రహదారిలో ఉల్లంపర్రు, జిన్నూరు, వేడంగి, జగన్నాధపురం వద్ద భారీస్థాయిలో గోతులు పడడంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో వర్షాలు తగ్గిన వెంటనే నవంబర్‌లో మరమ్మతులు చేపట్టేవారు. అయితే ఈ ఏడాది మరమ్మతులు చేపట్టకపోవడంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకొల్లు, కొంతేరు, కాజ రహదారి కూడా ఏళ్లుగా మరమ్మతులు లేక వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.


మార్టేరు రహదారిలో ఉల్లంపర్రు వద్ద గోతులు

రహదారి మరమ్మత్తులు చేపట్టాలి

ఎస్.భాస్కరరాజు, రైతు

పాలకొల్లు - మార్టేరు, భీమవరం - వీరవాసరం - పాలకొల్లు, నరసాపురం - పాలకొల్లు ఆర్అండ్‌బి రహదారులు అధ్వానంగా మారడంతో నిత్యం ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో అనేకమంది గాయాలపాలౌతున్నారు. వర్షాకాలం ముగిశాక మరమ్మతులు చేపట్టేవారు. ఈ ఏడాది ఎటువంటి పనులూ చేపట్టకపోవడంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారయ్యాయి. తక్షణం అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.


గోతులమయంగా పాలకొల్లు - భీమవరం రహదారి

ప్రజాశక్తి పరిశీలన 2

క్రీడా ముత్యం.. హరిప్రియ..

ఎత్తైన కొండలు, సెలపర్లు, పచ్చని అటవీ అందాలతో అలరారుతోంది ఆ కుగ్రామం. అటువంటి సహజ వాతావరణంలో పుట్టి పెరిగిన గిరిపుత్రిక నేడు పరుగులరాణిగా, ఛాంపియన్‌గా దూసుకుపోతోంది. చిన్నతనంలో తోటి పిల్లలతో ఆడుకుంటూ అడవి చుట్టూ పెట్టిన పరుగులు, కాల్వల వెంబడి వేసిన అడుగులు, రానున్న రోజుల్లో తనకు సహజసిద్ధ శిక్షణగా నిలుస్తుందని ఆ గిరిపుత్రిక ఎన్నడూ ఊహించలేదు. ఎటువంటి శిక్షణ లేకుండానే చదువుతోపాటు తన పరుగుకు పదునుపెట్టి మెరుగులు దిద్దుతూ నేడు జాతీయస్థాయి పోటీల్లో పతకమే లక్ష్యంగా సాధన చేస్తోంది. ఆరో తరగతిలో మొట్టమొదటి సారిగా పరుగుపందెంలో పాల్గొన్న ఆమె నేడు పతకాల పంట పండిస్తోంది. అటు చదువులోనూ ఇటు పరుగుపందెంలోనూ రాణిస్తోంది. ఆమె ఎవరో కాదు జీలుగుమిల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న సిరివారిగూడేనికి చెందిన సిహెచ్ హరిప్రియ.

- పరుగుపందెంలో రాణిస్తున్న గిరిపుత్రిక హరిప్రియ
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

క్రీడలు..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

హరిప్రియ వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి హార్టీకల్చర్ యూనివర్శిటీలో వ్యవసాయ విద్యార్థినిగా చదువుతూ పరుగుపందెంలో అగ్రస్థానంలో నిలిచింది.

జాతీయ స్థాయి పరుగుపందెం పోటీలకు ఎంపిక

సిరివారిగూడేనికి చెందిన సత్యనారాయణ, జగదాంబ దంపతుల కుమార్తె సిహెచ్.హరిప్రియ. ఆమె వెంకటరామన్నగూడెంలో డాక్టర్ వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్శిటీ స్థాయి పోటీల్లో భాగంగా గత మూడేళ్లుగా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 30 నుండి ఫిబ్రవరి ఐదో తేదీ వరకూ బెంగుళూరులో జరగనున్న ఈ పోటీల్లో హరిప్రియ పాల్గొనుంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన హరిప్రియ పతకమే లక్ష్యంగా పరుగులు తీస్తోంది.

లక్ష్య సాధన దిశగా..

వ్యవసాయ విద్యార్థిని అయిన హరిప్రియ పరుగు పందెంలోనే కాకుండా చదువులోనూ ఎక్కడా వెనుకడుగు వేయకుండా ముందుకెళ్తోంది. హార్టీకల్చర్ మూడో సంవత్సరం విద్యార్థి అగ్రికల్చరల్ పాలటెక్నిక్‌లో కళాశాల ప్రథమస్థానంలో నిలిచింది. వ్యవసాయ పరిశోదకరాలుగా ఉద్యోగాన్ని సాధించి రైతుకు సహాయపడడమే తమ లక్ష్యమని హరిప్రియ తెలిపింది. ఇటు చదువును, అటు పరుగును నిర్లక్ష్యం చేయకుండా ముందుకెళ్తానని ధీమా వ్యక్తం చేసింది.


హరిప్రియ సాధించిన పతకాలు


తల్లిదండ్రులతో హరిప్రియ


రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతితో హరిప్రియ

చింతలపూడి ఆసుపత్రికి.. సుస్తీ..!

వైద్యుల కొరత - పరికరాలు ఉన్నా నిరుపయోగం
క్షీణించిన పారిశుధ్యం - రోగుల అవస్థలు


చింతలపూడి ఆసుపత్రి

ప్రజాశక్తి - చింతలపూడి

కృష్ణా, పశ్చిమగోదావరి, తెలంగాణ సరిహద్దు నుంచి లక్షలాది మంది ప్రజలకు సంజీవినిగా ఉన్న చింతలపూడి ప్రభుత్వాసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గ కేంద్ర కావడంతో నిత్యం వందలాది మంది ప్రజలు ఆసుపత్రికి వస్తుంటారు. ఈ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా ఉపయోగించే నాధుడు లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన చికిత్స అందడం లేదు. ఆసుపత్రి 30 పడకలకు పరిమితం కావడంతో రోగులకు చికిత్స అందడం లేదు. రూ.10 కోట్ల వ్యయంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఇప్పటికే రెండు సార్లు శంకుస్థాపన చేసినా పనుల్లో పురోగతి లేదు.

చింతలపూడి ఆసుపత్రిలో రోజురోజుకూ రోగులు పెరగడంతో ఆసుపత్రికి మౌలిక సదుపాయం కల్పించడంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ విఫలమయ్యారు. పారిశుధ్యం క్షీణించడంతో రోగులు ఆసుపత్రి పరిసరాల్లో ఉండలేకపోతున్నారు. ఇటీవల డిసిహెచ్ఎస్ డాక్టర్ శంకరరావు హాస్పటల్‌ను తనిఖీ చేసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసింది. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా సిబ్బంది ప్రవర్తనలో మార్పు లేదని రోగులు అంటున్నారు. ఆపరేషన్ థియేటర్, రోగులు నిద్రించే పడకలు, బెడ్ షీట్లు, పాడై దుర్వాసన వెదజల్లుతున్నాయి.

ఖాళీగా మూడు వైద్యుల పోస్టులు..

ఈ ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ముగ్గురు వైద్యులు మాత్రమే ఉండడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఆసుపత్రికి రోజుకు సుమారు 500 మంది రోగులు వస్తుంటారు. ప్రస్తుతం జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్‌లుగా పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు ఒపి విభాగంలో మొత్తం పరీక్షించాల్సి ఉండటంతో వారికి తలకుమించిన భారంగా మారింది. హాస్పటల్‌లో మత్తు వైద్యనిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, దంతం వైద్య నిపుణుల పోస్టులు ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్నాయి. ఇటీవల చేపట్టిన వైద్య ఉద్యోగుల భర్తీలో చింతలపూడి ఆసుపత్రిలో పనిచేయడానికి వైద్యులు ముందుకు రావడం లేదు. స్థానిక రాజకీయ పరిస్థితుల వల్ల చింతలపూడి ఆసుపత్రిలో సేవలందించేందుకు వైద్యులు వెనుకంజవేస్తున్నారు.


ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డిసిహెచ్ఎస్ శంకరరావు

పరికరాలు ఉన్నా వినియోగించరు..

ఆసుపత్రిలో సుమారు రూ.70 లక్షల విలువైన వైద్య పరికరాలు ఉన్నా ఆసుపత్రి సిబ్బంది వినియోగించడం లేదు. వైద్య పరికరాలు ఉపయోగించకుండా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసి ఆసుపత్రి యాజమాన్యం పబ్బం గడుపుతోంది. పైఅధికారులు వచ్చినప్పుడు మాత్రమే వాటిని ఉపయోగిస్తున్నారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా పరికరాలు ఎందుకూ పనికిరాకుండా నిరుపయోగంగా ఉన్నాయి.

ఆర్ఐడిఎఫ్ నిధులు ఏమైనట్లు.!

2015లో ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికీ కోట్లలో ఆర్ఐడిఎఫ్ నిధులు మంజూరు చేసింది. వాటిలో చింతలపూడి ఆసుపత్రికి సుమారు రూ.46 లక్షలు మంజూరయ్యాయి. ఆసుపత్రిలో మౌలిక వసతులు, అభివృద్ధి చేసినట్లు లెక్కలు చూపుతున్నా నిధుల్లో భారీస్థాయిలో అవకతవకలు జరిగినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆసుపత్రి యాజమాన్యాన్ని అడిగితే అభివృద్ధికి ఖర్చుపెట్టినట్లు చెబుతున్నారు.

నిరుపయోగంగా పరికరాలు

తుల్లిమెల్లి కుటుంబరావు, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ , ఎర్రగుంటపల్లి



చిన్నపిల్లల వైద్య పరికరాలు ఉన్నా డాక్టర్ లేకపోవంతో అవి నిరూపయోగంగా మారాయి. మత్తు, దంత, గైనకాలజిస్టు డాక్టర్ల కొరత ఉండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు స్థానికంగా కోటర్స్ ఇచ్చినా నివాసం ఉండటం లేదు. దీంతో ఆసుపత్రిపై పర్యవేక్షణ కరువైంది. సిబ్బంది రోగులపై దురుసుగా వ్యవహరించినా చర్యలు తీసుకోవడం లేదు.

వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి

జి.శ్రీకాంత్, చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం ఉదయం వెళ్తే మధ్యాహ్నం వరకూ వేసి ఉండాల్సిందే. కనీస సౌకర్యాలు లేక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి. ఆసుపత్రి సిబ్బంది రోగులపై మర్యాదపూర్వకంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తే సహించం

మాలిని, ఆసుపత్రి సూపరింటెండెంట్, చింతలపూడి

ఆసుపత్రిలో సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తే సహించేది లేదు. అలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆర్ఐడిఎఫ్ నిధుల గురించి నాకేమి తెలీదు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలందిస్తాను. ప్రజలకు అందుబాటులో ఉంటాను.

వంతుల వారీ తంటాలు..!

తగినంత లేని నీటి నిల్వలు

8 ఎకరాల్లో పడని నాట్లు

వంతులతో పెరగనున్న కష్టాలు

ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను ఇరిగేషన్ శాఖ కార్యాలయ పరిధిలో ఈనెల నాలుగో తేదీ నుంచి సాగునీటి విడుదలకు వంతుల వారీ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిసింది. కార్యాలయ పరిధిలోని భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో 22,285 ఎకరాల విస్తీర్ణం ఆయకట్టు ఉండగా ఇరిగేషన్ శాఖ లెక్కల ప్రకారం అందులో 65 శాతం మేర నాట్లు పూర్తయ్యాయి. అయితే ఈ 65 శాతం కూడా ప్రధాన కాలువ నుంచి ఆయిల్ ఇంజన్లను వినియోగించి మోటార్ల ద్వారా సాగునీటికి తరలించుకోవడం వల్లే పూర్తయ్యాయి. మిగిలిన ఎనిమిది వేల ఎకరాల్లో ఇంత వరకూ నాట్లు పడలేదు. ప్రస్తుతం గోదావరిలో 1,500 క్యూసెక్కులు, సీలేరు ద్వారా ఏడు వేల క్యూసెక్కుల నీరు అందుబాటులో ఉండటంతో వంతుల వారీ విధానంలో ఏలూరు కాలువకు 4,150 క్యూసెక్కుల నీటిని ఇవ్వనున్నారు. ఏలూరు కాలువకు గుండుగొలను వద్ద 4.5 అడుగుల నీటి మట్టం ఉంటే తప్ప కాలువ అనుబంధంగా ఉన్న కాలువలకు నీరు అందదు. కానీ ప్రస్తుతం ఈ నీటి మట్టం నాలుగు అడుగులుగా ఉంది. రైతుల అవసరాలకు 230 క్యూసెక్కుల నీరు అవసరం కాగా ప్రస్తుతం 180 క్యూసెక్కుల నీరు మాత్రం అందుబాటులో ఉంది. దీనిని నుంచి 30 క్యూసెక్కుల నీటిని భీమడోలు, దెందులూరు మండలాల్లోని తాగునీటి చెరువులతో పాటుగా ఏలూరు నగరవాసులకు తాగునీటి అవసరాలకు తరలిస్తున్నారు. ఫలితంగా 150 క్యూసెక్కుల నీరు మాత్రమే రైతులకు అందుబాటులో ఉంది. ఇది ప్రస్తుతం రైతుల అవసరాలు ఏ మాత్రం తీర్చే పరిస్థితిలో లేదు. ఎనిమిది వేల ఎకరాల్లో నాట్లు పడని ప్రాంతాల్లో మెరక ప్రాంతాలైన పూళ్ల, సూరప్పగూడెం, సింగవరం ప్రాంతాల్లోని పొలాలకు నీరు విడుదలయ్యే అవకాశం లేకపోవడంతో ఆ ప్రాంతాలో నాట్లు పడలేదు. వంతుల వారీ విధానంలో భాగంగా ఏలూరు కాలువను గుండుగొలను సెక్షన్ పరిధిలో ఒక యూనిట్‌గా పరిగణలోకి తీసుకుని నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. దీనికోసం మురుగు కాలువలకు అడ్డుకట్టలు, ప్రధాన కాలువలకు అడ్డుకట్టలు వేయడంతో పాటుగా చేపల చెరువులకు నీటిని మళ్లించకుండా చర్యలు చేపడుతున్నారు. కానీ వారి లెక్కల ప్రకారం అందుబాటులో ఉన్న నీటితో ఇది కూడా సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వారు రెండు సంవత్సరాల క్రితం నీటి ఎద్దడి తలెత్తినప్పుడు 1:140 ట్యూటీ ద్వారా సాగునీటిని అందించిన తరహాలో ప్రస్తుతం కూడా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన ఎనిమిది వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు వంతుల వారీ విధానం అమలు కొంత కాలం వాయిదా వేయాలని, ఆ ఎనిమిది వేల ఎకరాల్లో నాట్లు పడిన తర్వాత వంతులవారీ విధానం అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



నీటిమట్టం తక్కువగా ఉన్న కాలువ

పనికి తగ్గ వేతనమివ్వాలని నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విద్యుత్ డివిజన్ ఇంజినీర్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు పి.కాశీమధుబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.బాలాజీ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. చాలీచాలని జీతాలతో, నెలవారి జీతాల సక్రమంగా రాక విద్య, వైద్యంలాంటి కనీస వసతులు కల్పించుకోలేక కాంట్రాక్ట్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విధి నిర్వహణలో కాంట్రాక్ట్ కార్మికులు మరణిస్తే రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ఇదే ధోరణి కొనసాగిస్తే ఈనెల 27 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎస్.వి.రమణమూర్తి, జి.హరత్, సి.చంద్రశేఖర్, వి.గంగయ్య, బి.వి.సురేష్, వి.బాబీ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆదర్శప్రాయులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళల కోసం పోరాటం చేసిన సావిత్రిబాయి పూలే ఆదర్శప్రాయురాలని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తొమ్మిది మంది మహిళా ఉపాధ్యాయులను మంత్రి, మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. అనంతరం బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వర్తనపల్లి కాశీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల హక్కుల కోసం పోరాడారని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే పోరాటం ఫలితంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా నవీన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కిల్లాడి ప్రసాద్, మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ పోతుల అన్నవరం, పాతూరి రాంప్రసాద్ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

ఉంగుటూరు: దేశం సమగ్రాభివృద్ధి సాధించాలంటే మహిళా సాధికారత అనివార్యమని తాడేపల్లిగూడెం వైష్ణవి ఆసుపత్రి ఎమ్‌డీ, వెలుగు స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని ఉంగుటూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, రంగు వెంకటేశ్వరరావు అడపా శోభారాణి పాల్గొన్నారు.

గణపవరం: జెడ్‌పి బాలికల పాఠశాలలో సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలను శ్రీవివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం పి.శ్రీదేవి, సిపిఎం ఏరియా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, సందక చంద్రయ్య, తెలుగు పండింట్ రంగనాయకమ్మ పాల్గొన్నారు.

తణుకు రూరల్: సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను అత్తిలి మండలంలో ఎస్‌టి, ఎస్‌సి, బిసి కమ్యూనిటీ భవనంలో బిసి చైతన్య వేధిక జిల్లా అధ్యక్షులు ఆకుల కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల కిరణ్ మాట్లాడుతూ సావిత్రి బాయిపూలే చేసిన సేవలు కొనియాడారు. పూలే దంపతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుట్టా శ్రీను, దేవలూరి గంగాధర్, దుక జయరాం, బుడితి సుజన్‌కుమార్, రాజు, వానపల్లి త్రినాథ్, కాసాని రాముడు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంఅర్బన్: సమాజంలో ప్రజలందరూ అభివృద్ధి చెందాలంటే చదువు ఒక్కటే మార్గమని జాతీయ బిసి ప్రజాసంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక బిసి ప్రజా సంక్షేమసంఘం కార్యాలయంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయని సావిత్రి బాయిపూలే జయంతి కార్యక్రమం బొగ్గెల్లి శివరామారావు అధ్యక్షతన నిర్వహించారు. పిడిఎస్‌యు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి ఎం.రూపాశకంర్ అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక ఆరో వార్డులో వికలాంగుల పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా బిసి నాయకురాలు యర్రోజు పద్మావతి, సీనియర్ బిసి నాయకులు దాసరి ఆనందస్వామి, చింతకాయల సత్యనారాయణ, కుసుపూడి రాజారావు పాల్గొన్నారు.

సిఎం సభకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- తాళ్లపూడి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలోని తాళ్లపూడి మండలానికి ఈనెల ఎనిమిదో తేదీన రానున్న నేపథ్యంలో జన్మభూమి సభను నిర్వహించే స్థల పరిశీలన బుధవారం చేపట్టారు. జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్, ఎక్సైజ్ శాఖమంత్రి కెఎస్.జవహర్, జిల్లా ఎస్పి రవిప్రకాష్ బుధవారం తాళ్లపూడి గ్రామానికి వచ్చారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలిప్యాడ్‌కు, బహిరంగ సభ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. తాళ్లపూడి గ్రామంలోని నాలుగు ప్రదేశాలను పరిశీలించారు. గోదావరి గట్టు సమీపంలోని సెయింట్ య్యూజన్ స్కూల్ సమీపంలోని వినాయక గార్డెన్స్‌కు చెందిన లేఅవుట్ ప్రదేశాన్ని ముఖ్యమంత్రి దిగడానికి హెలిప్యాడ్ నిర్మాణానికి, అనంతరం నిర్వహించే బహిరంగ సభ నిర్వహించడానికి అనువుగా ఉంటుందని భావించారు. వచ్చే వాహనాల పార్కింగ్ కోసం తాళ్లపూడిలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద, పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని, వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలకు చెందిన మైదానాన్ని వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసే విధంగా ఆలోచన చేశారు. సిఎం సభకు సుమారు పదివేల మంది హాజరవుతారన అంచనాలతో బహిరంగ సభ, సభా వేదికను సిద్ధం చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాజు చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి వెంకటేశ్వరరావు, ఇంటిలిజెన్స్ డిఎస్‌పి విజయపాల్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, మంత్రి, ఎస్పి

11న గీతాంజలిలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గీతాంజలి విద్యాసంస్థల కార్యాలయంలో ఈ నెల 11న విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.శ్రీకాంత్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, ఇతర జూద క్రీడలకు వ్యతిరేకంగా, యువత పెడదారి పట్టకుండా ఉండేలా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా క్విజ్, సమకాలీన అంశాలపై పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. పోటీలో పాల్గొనే వారు ఇతర వివరాలకు పేర్ల నమోదుకు 9666214678 నంబరును సంప్రదించాలని కోరారు.

సిహెచ్‌సికి ఫ్యాన్ల బహూకరణ

ప్రజాశక్తి - భీమడోలు

మానవత సంస్థ ఆధ్వర్యంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి దాతలు ఆరు ఫ్యాన్లను బుధవారం అందించారు. ఈ సందర్భంగా దాతలు కెవి.కోటేశ్వరరావు మూడు ఫ్యాన్లు, గొట్టాపు భీమారావు కుటుంబ సభ్యులు ఒక ఫ్యాను, ముళ్ల కృష్ణచైతన్య ఒక ఫ్యాన్, పశుపులేటి ప్రేమలత ఫ్యాన్ అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు జి.నూకరాజు, ఎ.రాంబాబు, ఆర్.గంగాధరరావు, జి.రమణాశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి , ఉంగుటూరు

జన్మభూమి - మాఊరు, ఆత్మగౌరవం కార్యక్రమంలో భాగంగా నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వాలీబాల్, స్కిప్పింగ్, పరుగు పందేలు నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వి.సోమశేఖర్ పేర్కొన్నారు. ఆత్మగౌరవం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, ఆనందం అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీలు నతానియేలు, కుమార్ పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఐ జిల్లా 25 మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఆహ్వాన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ధనలక్ష్మి, నెక్కంటి సుబ్బారావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పి.అప్పలస్వామి, మండా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన కొత్త సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

తాడేపల్లిగూడెం మండలం మెట్టఉప్పరగూడెం గ్రామంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఏటా ఈ గ్రామంలో నూతన సంవత్సర వేడుకలను మూడురోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఆఖరి రోజు సందర్భంగా సంగీత కచేరిలు, చిన్నారుల నృత్యాలు, క్రీస్తు జనన నాటికలు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ వేడుకలకు గ్రామంలో కన్వీనర్‌గా ఏలూరు వెంకట్రావు వ్యవహరిస్తున్నారు.



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

జిఓ 151 ప్రకారం వేతనాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు


మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు జిఓ నంబరు 151 ప్రకారం జీతాలు పెంచి అమలు చేయాలని, 17 నెలల ఎరియర్స్ ఇవ్వాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్మికులు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ధర్నానుద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్టు సిబ్బందికి జీతాలు పెంచుతూ జిఓ విడుదల చేసి 17 నెలలు గడిచినా నగరపాలక సంస్థ అధికారులు అమలు చేయడం లేదని అన్నారు. ఈ జిఓ అమల్లోకి వస్తే కాంట్రాక్టు వర్కర్స్ జీతం రూ.11 వేల నుండి రూ.12 వేలకు పెరుగుతుందని, 17 నెలల ఎరియర్స్ వస్తాయని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, కార్మికులు పస్తులతో పనులు చేస్తున్నారని చెప్పారు. జిఓ నంబరు 151 అమలు చేసి జీతాలు పెంచాలని, 17 నెలల ఎరియర్స్ ఇవ్వాలని, మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో పనులు నిలుపుదల చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా, రాయబారం కార్యక్రమానికి జుంజుర్తి వివేకవతి, చోడగిరి మరియమ్మ, బండి భవాని, నక్కా భాగ్యలక్ష్మి, యిట్టా అరుణ, బంగారు సీత, ఎలుబూడి లక్ష్మి, కౌడాడ లీలావతి, అర్జి రాజమ్మ, పంతు నాగరాజు, పీక చిట్టెయ్య, కారు దుర్గారావు, లావేటి కృష్ణారావు, తానుకి జార్జి, అంగులూరి జాన్‌బాబు, బంగారు శ్రీను, నేదూరి వెంకట్రావు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : మున్సిపల్ కార్మికుల

మున్సిపల్ కార్మికుల ధర్నాలు

సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు గార రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జి.సాంబశివరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గార రంగారావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు జిఓ నంబరు 151 ప్రకారం నెలకు రూ.12వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బళ్ల చినవీరభద్రరావు, వై.మందులయ్య, అర్జి కృష్ణబాబు, నీలాపు ఆదినారాయణ, ఎం.వరమణి, వెంకటరమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

'జన్మభూమి'లో నిలదీతల పర్వం



ఉంగుటూరులో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

ఉంగుటూరు: మండలంలో తిమ్మయ్యపాలెం, ఎ.గోకవరం, గోపాలపురం, రామచంద్రపురం గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమిలో ఆయన పలుచోట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు, చంద్రన్న సరుకులు, ఇంటి నిర్మాణాలకు రుణాలు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేకాధికారి డి.వరప్రసాద్, మండల ప్రత్యేకాధికారి ఎన్.రంగారావు తిమ్మయ్యపాలెం, ఎంపిడిఓ జె.రేణుకమ్మ, గోపాలపురం, రామచంద్రపురంలో తహశీల్దారు అప్పారావు పాల్గొన్నారు.

కనిపించని ప్రజాప్రతినిధులు..

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెబుతున్న జన్మభూమి - మాఊరు సభలకు మండలానికి చెందిన మండల స్థాయి ప్రజాప్రతినిధులు హాజరుకాలేదు. ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు, వైఎస్ ఎంపిపి, మాజీ ఎఎంసి ఛైర్మన్, టిడిపి మండలాధ్యక్షుడు హాజరుకాలేదు. ఎంఎల్‌ఎతో పాటుగా భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు కరణం పెద్దిరాజు హాజరయ్యారు.

తాళ్లపూడి : గ్రామాలాభివృద్ధికి జన్మభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని జన్మభూమి మండల ప్రత్యేకాధికారి గౌసియా బేగం అన్నారు. మండలంలోని పోచవరం గ్రామంలో ఎంపిపి కాసాని అనంతలక్ష్మి అధ్యక్షతన బుధవారం జన్మభూమి మాఊరు గ్రామ సభ నిర్వహించారు. జన్మభూమి అధికారులకు గ్రామ సర్పంచి రమేష్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జ్యోతిర్మయి, ఎంఇఓ కెంపురత్నం, హౌసింగ్ ఇఇ పేరయ్య పాల్గొన్నారు.

గణపవరం : పేదలందరికీ వివిధ సంక్షేమ పథకాలు అందించటానికి టిడిపి ప్రభుత్వం ముందుంటుందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని వల్లూరు, పిప్పర, ముప్పర్తిపాడు జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ పిప్పర గ్రామంలో 29 మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారన్నారు. వీరికి పోషకాహారం అందిచాల్సిన అవసరం ఉందన్నారు. పోషకాహారం అందించే దాతలు ముందుకురావాలని కోరారు. కాగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జన్మభూమి నిర్వహించాల్సి ఉండగా అలంకార ప్రాయంగా టివి పెట్టారు. దానికి కేబుల్ కలెక్షన్ ఇవ్వలేదు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ మధుసూదనరావు, ఎంపిడిఓ పద్మా, ఎఓ పార్థసారధి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు నిర్మించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. జన్మభూమి మాఊరు కార్యక్రమం స్థానిక ఆరోవార్డులో కౌన్సిలర్ పైబోయిన వైదేహి, ఎనిమిదో వార్డులో కౌన్సిలర్ ఎన్‌వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది.

భీమడోలు : సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాల్లో ఆక్రమణలను తొలగించాల్సిందేనని ఉంగుటూరు ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు స్పష్టం చేశారు. మండలంలోని పొలసానిపల్లి, కురేళ్లగూడెం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆయా సర్పంచులు ఎం.కోటేశ్వరమ్మ, కె.సునీత జోగేశ్వరరావు, అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు, ఎంపిపి రామతులసమ్మ, ఎంపిటిసిలు ఎస్‌కె.రహీమా బేగం, ఎన్.ఎల్లయ్య, ఎన్‌వి.సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి ఇ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పింఛన్లపై మంత్రి మాణిక్యాలరావుకు ప్రశ్నల వర్షం

స్థానిక ఆరో వార్డులో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో పింఛన్లపై మంత్రి మాణిక్యాలరావును ఆ వార్డుకు చెందిన పుప్పాల రమ్య, యరకరాజు సుబ్బలక్ష్మి, షేక్ షాహిదాబీ నిలదీశారు. వారు మాట్లాడుతూ మూడోవిడత జన్మభూమి సభల నుంచి పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నామని, కానీ ఇప్పటివరకూ పింఛన్లు రాలేదని తెలిపారు. ఈ జన్మభూమి కార్యక్రమంలో కూడా రాలేదని, ఆన్‌లైన్‌లో పేరు వచ్చినా తమకు ఎందుకు ఇవ్వడం లేదని మంత్రి మాణిక్యాలరావును మహిళలు నిలదీశారు. వయస్సు రీత్యా వృద్ధాప్య పింఛన్‌కు, భర్తను కోల్పోయి పింఛనుకు అర్హత ఉన్నా ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ పింఛన్ల కోసం మరోసిరొ దరఖాస్తు చేసుకుంటే వచ్చే నెల నుంచే పింఛను వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు ఉన్నా పింఛను ఎందుకు రాలేదని కమిషనర్ బ్రహ్మాజీని మంత్రి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కిల్లాడి ప్రసాద్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా నవీన్, గొర్రెల శ్రీధర్ పాల్గొన్నారు.

తొలుత సామూహిక సీమంతాలు నిర్వహించారు. వివిధ స్టాల్స్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమడోలు ఏరియా కన్వీనర్ సమన్వయ కర్త ఆర్.లింగరాజుతో పాటూ అఖిల పక్ష నేతలు గ్రామంలోని సిపిఎస్ స్థలాల ఆక్రమణ ఇతర సమస్యలు దీన్ని పరిష్కారానికి తన వంతు ప్రయత్నాలను ఎంఎల్‌ఎకు వివరించారు. ఇళ్ల స్థలాల పంపిణీకి నిరుపయోగంగా ఉన్న ఇళ్ళ స్థలాలగా కేటాయించాలని కోరారు. చెర్వులు అక్రమణకు గురైన విషయాన్ని ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చారు.

నల్లజర్ల : ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత తమదేనని రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి కెఎస్.జవహార్ అన్నారు. బుధవారం నల్లజర్లలోని జన్మభూమి మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, సర్పంచి యలమాటి శ్రీనివాసరావు, ఎంపిపి జమ్ముల వీరవెంకటసతీష్ పాల్గొన్నారు.

చాగల్లు: జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి వెంకయమ్మ అధ్యక్షతన అరోగ్యం, ఆనందం అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాగల్లు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వైజెఎం.సాయి, కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాదరావు, వి.తారమ్మ పాల్గొన్నారు.

దేవరపల్లి : ప్రజాసమస్యల పరిష్కారానికి వేదిక జన్మభూమి మాఊరు కార్యక్రమం అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖమంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని దుద్దుకూరు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహారావు, జెడ్‌పిటిసి సభ్యులు కొయ్యలమూడి సుధారాణి పాల్గొన్నారు.

పెరవలి : పెరవలి మండలం అన్నవరప్పాడు ఖండవల్లి గ్రామాల్లో జన్మభూమి- మాఊరు కార్యక్రమం ఆయా పంచాయతీల వద్ద నిర్వహించారు. ఖండవల్లిలో డిసిఎంఎస్ ఛైర్మన్ రవివర్మ పాల్గొన్నారు.

రొయ్యలచెరువులతో నష్టపోయాం

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రులో రొయ్యల చెరువుల తవ్వకాల వల్ల తమ గ్రామంలో 180 ఎకరాల్లో ఉప్పునీటి మేటలు వేశాయని, దీనివల్ల వరి పొలాలు పూర్తిగా నాశనమయ్యాయని పలువురు రైతులు వాపోయారు. ఈ మేరకు బుధవారం నిడమర్రులో నిర్వహించిన జన్మభూమి సభలో రైతులు ఉంగుటూరు శాసన సభ్యులు గన్ని వీరాంజనేయుల వద్ద తమ సమస్యలను ఏకరువు పెట్టారు. రొయ్యల చెరువుల తవ్వకాల వల్ల వరి పొలాలు పూర్తిగా పాడైపోయాయని వాపోయారు. దీనిపై ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ వచ్చే వేసవిలోపు ఈ సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. దీంతో పాటూ కొల్లేరులో కాంటూరులో ఉన్న పొలాల్ని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఇంటి ఉదయభాస్కరరావు, జిల్లా స్పెషల్ అధికారి డి.వరప్రసాద్, మండల నోడల్ అధికారి కృష్ణ, ఎంపిపి నిమ్మల మాణిక్యాలరావు, జెడ్‌పిటిసి సభ్యులు దివాకరరావు, ఎంపిడిఓ దామోదరరావు, వైస్ ఎంపిపి పి.నక్షత్రం పాల్గొన్నారు.

పత్తేపురంలో జరిగిన జన్మభూమి సభకి మానుకొండ మణి అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న ఎంఎల్‌ఎ గన్ని మాట్లాడుతూ మండలంలో పందికోడు, తోకలపల్లి, నిడమర్రు, భువనపల్లి, గణపవరం, కలవపూడి రహదార్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని అన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

బకాయిలు చెల్లించండి

సౌత్‌స్టార్ టైల్స్ పరిశ్రమ వద్ద కార్మికుల ధర్నా

ద్వారకాతిరుమల : బకాయి వేతనాలను చెల్లించాలని, విధుల నుంచి తొలగించిన సిబ్బందిని విధుల్లో చేర్చాలని మండలంలోని తిమ్మాపురం శివారు సౌత్‌స్టార్ టైల్స్ పరిశ్రమ వద్ద బుధవారం కార్మికులు ధర్నా చేపట్టారు. పరిశ్రమ కార్మికులకు మద్దతుగా సిఐటియు జిల్లా నేత ఆర్.లింగరాజు ఈ ధర్నాలో పాల్గొన్నారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన సౌత్‌స్టార్ సిరామిక్ పరిశ్రమ యాజమాన్యాం నాలుగు నెలల క్రితం మారింది. పాత యాజమాన్యం ఉన్న సమయంలో పరిశ్రమలో పనిచేస్తున్న 150 మంది కార్మికులకు రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుత, యాజమాన్యం రెండు నెలల వేతనాల బకాయిలు ఇవ్వాల్సి ఉంది. అయితే పరిశ్రమలో 15 రోజులుగా ఉత్పత్తిని నిలిపివేసి ఉన్న మెటీరియల్‌ను విక్రయిస్తున్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నయించుకున్నా వారు పట్టించుకున్న దాఖలాలు కరువయ్యాయి. వేతనాలపై ప్రశ్నిస్తున్నారనే కక్షతో యాజమాన్యం హెచ్‌ఆర్ మేనేజర్ బొప్పా కిషోర్‌ను, సూపర్‌వైజర్ నాగేశ్వరరావును విధుల నుంచి తొలగించారు. దీంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. తమకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని, విధుల నుంచి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నేత పి.సత్యనారాయణ, సిఐటియు నేత కె.వెంకట్రావు పాల్గొన్నారు.

చాగల్లుకు 'కొవ్వూరు' సెగ

రెండు గ్రూపులుగా విడిపోయిన తెలుగుతమ్ముళ్లు

చాగల్లు: కొవ్వూరులో మంత్రి జవహర్ చుట్టూ నెలకొన్న వివాదం నేపథ్యంలో పార్టీ నాయకులు రెండుగా చీలిపోయిన నేపథ్యంలో ఆ సెగ మండలానికి కూడా తగిలింది. మంత్రి జవహర్‌కు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా కొందరు మండలంలో టిడిపి నేతలు చీలిపోయారు. ఈ నేపథ్యంలో అనుకూల వ్యతిరేక గ్రూపుల నేతలు బుధవారం కొవ్వూరు పట్టణానికి వెళ్లారు. అక్కడ కొందరు మంత్రి అనుకూల గ్రూపులో చేరగా, మరికొందరు వ్యతిరేక గ్రూపులో చేరారు. ఈ పరిణామాలతో మండలంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

సబ్‌స్టేషన్‌తో లోఓల్టేజీ సమస్య పరిష్కారం

దేవరపల్లి : మండలంలోని యర్నగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న 132 కెవి సబ్‌స్టేషన్ పనులను నెలాఖారులోపు పూర్తి చేయాలని ఎపి ట్రాన్స్‌కో సిఎండి అజయ్‌జైన్ సంబంధిత కాంట్రాక్టరును ఆదేశించారు. మండలంలోని యర్నగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 132 కెవి సబ్‌స్టేషన్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా తీరుతుందని అన్నారు. రాబోయే వేసవి దృష్టిలో పెట్టుకుని ఈ సబ్‌స్టేషన్ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, సర్పంచి బొమ్మిన ప్రసాదరావు, వైఎస్ ఎంపిపి బాదంపూడి ఇందిరా పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సిఎండి అజయ్‌జైన్


పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

పింఛన్ల కోసం పడిగాపులు

ప్రజాశక్తి - లింగపాలెం

జన్మభూమి - మాఊరు గ్రామ సభలో వృద్ధులకు పింఛను ఇస్తామని చెప్పి భోజన సమయం దాటినా పట్టించుకోకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జన్మభూమి - మాఊరు గ్రామ సభలో వృద్ధులకు ఇస్తామని చెప్పిన పింఛన్లను భోజన సమయం దాటినా ఇవ్వకపోవడంతో వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం తాగటానికి మంచినీటి సౌకర్యం కూడా అధికారులు ఏర్పాటు చేయలేదని వృద్ధులు వాపోయారు. పింఛను విషయంపై అధికారులను వృద్ధులు ప్రశ్నించగా ప్రజాప్రతినిధులు భోజనం చేసిన తరువాత ఇస్తారని పేర్కొన్నారు. ఉదయం నుంచి పింఛను కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధుల విషయంలో నిర్లక్ష్యం వహించడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూడో విడత రుణమాఫీ అందజేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కె.జగ్గవరం సహకార సంఘం పరిధిలోని రైతులకు మంజూరైన మూడో విడత రుణమాఫీ నగదును ఆ సంఘం అధ్యక్షులు బొంతు సత్యనారాయణ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం పరిధిలో మూడో విడతకు గాను 625 మంది రైతులకు రూ.1.25 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సిఇఒ వి.వీరవెంకయ్య, ఓబిళ్లనేని రాంబాబు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎపిటిఎఫ్ 1938 ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గులోతు కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిపి పాఠశాల ఆవరణలో బుధవారం ఆ సంఘం మండల అధ్యక్షులు జె.నెహ్రూ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణ మాట్లాడుతూ బకాయి డిఎలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగులకు అమల్లో ఉన్న సిపిఎస్ పెన్షన్ విధానం రద్దు కోరుతూ తొమ్మిదో తేదీన ఎపిటిఎఫ్ సాధన సమితి ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులైన పలువురు ఉపాధ్యాయులు ఎపిటిఎఫ్ చేరారు. కార్యక్రమంలో చింతలపూడి ప్రధాన కార్యదర్శి కె.కాంతారావు, టి.నరసాపురం కార్యదర్శి సిహెచ్.రవీంద్రనాథ్, కె.రాజు, బి.రామస్వామి, జి.రమేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగమేళా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆంధ్రప్రదేశ్ ఎస్సి, ఎస్టి కమిషన్ సారథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, వికాస సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని విద్యావేత్త అలుగు ఆనందశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రాజమండ్రిలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 30కు పైగా కార్పొరేట్ సంస్థల్లో ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మేళాను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జెన్‌కో, ట్రాన్స్‌కో కంపెనీల్లో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు కాంట్రాక్టు కార్మికులు డిఇ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేసి డిపార్ట్‌మెంటు ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. సర్వీసును, వయస్సును పరిగణనలోకి తీసుకుని దశల వారీగా క్రమబద్ధీకరించాలని కోరారు. విధుల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిల్ కలెక్టర్లకు, బిల్ రీడర్లకు పీస్ రీడింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం డిఇ రవికుమార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంత విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యల తిష్ట : ఎస్ఎఫ్ఐ

కుక్కునూరు : మండలంలోని ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ అప్‌ల్యాండ్ జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం హేమంత్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్‌డి యాసిన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో తెల్లం మహేష్ మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో తగినన్ని మరుగుదొడ్లు, ఆట స్థలాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రయివేటు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దారా చినరాజు, కె.సందీప్, నవీన్, కిరణ్, పవన్, వరలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

'జన్మభూమి - మాఊరు'లో నిలదీతలు

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు బారిన పడుతున్న తమ గ్రామాన్ని ముంపు గ్రామాల జాబితాలో చేర్చకుండా అన్యాయం చేస్తున్నారని, ముంపు గ్రామాల జాబితాలో చేర్చి పరిహారం అందజేయాలని రాజీవ్‌నగర్ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. బుధవారం మండలంలోని బంజరగూడెం, అమరవరం పంచాయతీ కార్యాలయాల వద్ద జన్మభూమి మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు నివేదికలు చదువుతుండగా రాజీవ్‌నగర్ గ్రామస్తులు తమ గ్రామం పూర్తి ముంపులో ఉన్నప్పటికీ ముంపులో లేనట్లు పరిగణించి పునరావాస పరిహారపు జాబితాలో చేర్చలేదని వాపోయారు. మా గ్రామంలోని భూములను ముంపు పరిధిలోకి తీసుకుని పరిహారం ఇచ్చారని అయితే పునరావాస పరిహారపు జాబితాలో మాత్రం తమ గ్రామాన్ని చేర్చకపోవడం అన్యాయమన్నారు. భూములు మునిగి ఇళ్లు మునగవా అని అధికారులను ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలంటూ పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. దీంతో అధికారులు నిర్వాసితులను సర్దిచెప్పి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందించారు. కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ దుర్గాప్రసాద్, తహశీల్దారు రామాంజనేయులు, ఎపిఎం విల్సన్, పిహెచ్‌సి వైద్యులు సత్యం పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని ఊటసముద్రం గ్రామంలో జన్మభూమి కార్యక్రమాన్ని రైతులు అడ్డుకున్నారు. అధికారులు, పోలీసులు అడ్డుకున్నప్పటికీ సుమారు గంటపాటు కార్యక్రమాన్ని జరగనివ్వలేదు. తహశీల్దార్, రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అగ్రికల్చర్ ఎఒ రైతు రుణమాఫీ వివరాలను ప్రకటించడంతో ఒక్కసారిగా రైతులు సభా ప్రాంగణం దగ్గరికి దూసుకెళ్లారు. రుణమాఫీ ఇంకా జమ చేయకుండానే ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జన్మభూమి కార్యక్రమాన్ని ప్రజా సమస్యల వేదికని చెబుతూ రూ.కోట్లు ప్రజాధనాన్ని అధికారులు దుర్వినియోగం చేస్తూ సమస్యలను గాలికొదిలేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారి డి.గోపికుమార్, అగ్రికల్చర్ ఎఒ ప్రదీప్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బోయ, వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చవద్దంటూ ఆదివాసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రెడ్డిగణపవరం, అంతర్వేదిగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న జన్మభూమి మాఊరు గ్రామ సభలను అడ్డుకున్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐక్యవేదిక ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకునేంతవరకూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు ప్రభుత్వం న్యాయం చేయాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం అసెంబ్లీ తీర్మానాన్ని విరమించుకోవాలని కోరుతూ పోలవరం ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెల్లం లక్ష్మణరావు, మడ్లం మల్లేశ్వరరావు, కుంజం కృష్ణంరాజు ఉన్నారు.


బుట్టాయగూడెంలో అడ్డుకున్న గిరిజనులు

జీలుగుమిల్లి : మండలంలో బుధవారం జరిగిన టి.రాజవరం, రాసన్నగూడెం జన్మభూమి మాఊరు గ్రామసభలను గంటల తరబడి దళితులు అడ్డుకున్నారు. ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ సమస్యపై దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎంఎల్ఎను పిలిపించి సమాధానం చెప్పాలని జన్మభూమి సభలో దళితులు అధికారులను నిలదీశారు. దీంతో రెండు గంటలకు పైగా సభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జన్మభూమి ప్రత్యేకాధికారి షాజ నాయక్ మాట్లాడుతూ ఎంజాయ్‌మెంట్ల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సభలో ఎంపిడిఒ అన్నపాలిన, తహశీల్దారు రాజశేఖరరావు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని ఎంపిడిఒ శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా రామాలయం వద్ద సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ స్త్రీలు ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. అనంతరం ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయురాలు కరుటూరి అరుణకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి.నాగమౌళి పాల్గొన్నారు.


అరుణకుమారిని సత్కరిస్తున్న ఎంపిడిఒ శ్రీదేవి

డాంగేనగర్‌లో..

స్థానిక డాంగేనగర్‌లో నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.జెకె.నరేంద్రకుమార్ మాట్లాడుతూ డాంగేనగర్ ప్రాంతాన్ని దత్తత తీసుకుని పరిసరాల శుభ్రత, ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జన్మభూమి ప్రత్యేక అధికారి పివిఎస్.రాఘవయ్య అన్నారు. బుధవారం మండలంలోని సరిపల్లి గ్రామంలో ఎంపిడిఒ ఎం.రాజు, వేదాంతపురం గ్రామంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి ఆధ్వర్యంలోనూ జన్మభూమి మాఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా చూడాలన్నారు. అనంతరం వేదాంతపురం గ్రామంలో చిన్నారులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు ఆర్‌డిఒ మోహనరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పోలవరం ఎఎంసి ఛైర్మన్ పారేపల్లి రామారావు, జెడ్‌పి వైస్ ఛైర్మన్ చింతల వెంకటరమణ, ఎంపిపి అయినపర్తి చందన, సర్పంచ్ శ్రీనివాసు, పద్మావతి, గంగారత్నం వైస్ ఎంపిపి పారేపల్లి శ్రీను, ఉపసర్పంచ్ అబ్బు శ్రీను, సిఆర్‌పి సిహెచ్.వెంకటరమణ, ఎఒ పోసరావు, ఎం.సౌజన్య, ఎఇలు సిహెచ్.భాస్కరరావు, పి.చక్రవర్తి, త్రివిక్రమ్‌రాజు పాల్గొన్నారు.

లింగపాలెం : గ్రామస్థాయిలో నెలకొన్న సమస్య పరిష్కార వేదిక 'జన్మభూమి - మాఊరు' అని ఏలూరు ఆర్‌డిఒ చక్రధరరావు అన్నారు. మండలంలోని లింగపాలెం, శింగగూడెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చక్రధరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న 54 సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. అనంతరం 58 మంది విద్యార్థులకు గాను రూ.54 వేల ఉపకార వేతనాలు, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల కింద 75 గ్రూపులకు గాను రూ.5.25 లక్షల చంద్రన్న బీమా చెక్కులను ముగ్గురు లబ్ధిదారులకు రూ.90 వేలు అందజేశారు.

శింగగూడెంలో..

స్థానిక ఎంపిపి పాఠశాలలో నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి మొరంపూడి మల్లికార్జునరావు, జెడ్‌పిటిసి సభ్యులు పెదబాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జన్మభూమి నోడల్ అధికారి గణేష్‌కుమార్, తహశీల్దార్ బి.సోమశేఖర్, ఎంపిడిఒ క్రిష్ణకుమారి పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం

పాలకొల్లు: పాలకొల్లు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షులు దేవత నాగ రవికుమార్ తెలిపారు. ఈ శిబిరాన్ని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఎఎంసి ఛైర్మన్ జి.గాంధీ భగవాన్‌రాజు విచ్చేశారు. ముఖ్య అతిథిగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్రీరామ్మూర్తి వ్యవహరించారు. ఈ శిబిరంలో సుమారు 251 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 31 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కళ్లజోళ్ల నిమిత్తం క్లబ్ మాజీ అధ్యక్షులు జనార్ధన గుప్త ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కెవి.నర్సింహం, కోశాధికారి కె.జయభారతరెడ్డి, మాజీ అధ్యక్షులు బివి.రాధారమణ గుప్త పాల్గొన్నారు.

దొంగరావిపాలెం వద్ద శాశ్వత ఎత్తిపోతల పథకం నిర్మించాలి

ప్రజాశక్తి - ఆచంట

దొంగరావిపాలెం వద్ద శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలని సిపిఎం మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రచారజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కచేరీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో రాజగోపాల్ మాట్లాడుతూ జనవరి నుండి వంతులవారీ విధానంతో నీటి సరఫరా చేస్తామని, రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న మంత్రి పితాని సత్యనారాయణ, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాటలు రైతులు నమ్మడం లేదని విమర్శించారు. దొంగరావిపాలెం వద్ద 13 మీటర్ల లోతు నీరు ఉందని, ఈ నీరు సుమారు 40 వేల ఎకరాలకు సమృద్ధిగా అందుతుందని అన్నారు. తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకుని దొంగరావిపాలెం వద్ద తాత్కాలిక ఎత్తిపోతల పథకాన్ని నిలుపుదల చేసి శాశ్వత పథకాన్ని నిర్మిస్తే రైతులకు పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు అందుతుందని అన్నారు. కచేరీ సెంటర్‌లో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అనంతరం ఈ ర్యాలీ సిద్ధాంతం నుండి దొంగరావిపాలెం వరకూ కొనసాగింది.



కచేరీ సెంటర్‌లో మాట్లాడుతున్న సిపిఎం మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, రైతు సంఘం జిల్లా నాయకులు ఆకుల హరేరామ్, వలవల శ్రీరామ్మూర్తి, కేతా సూర్యారావు, బండి రంగారావు, వర్ధిపర్తి అంజిబాబు, సూర్నీడి వెంకటేశ్వరరావు, పిల్లి ప్రసాద్, చదలవాడ చంటిబాబు, బొర్రా ధర్మారావు, జోగి సత్యనారాయణ, రాయుడు వెంకన్న, నెక్కంటి కృష్ణమూర్తి, తోటపల్లి సత్యనారాయణ, వర్ధిపర్తి శ్రీను, ఎస్‌విఎన్ శర్మ, కొత్తపల్లి సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఎల్‌సి రామ సూర్యారావు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని పొలమూరులోని శెట్టిబలిజపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ముత్యాల సత్యవతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో డిఇఒ సివి రేణుక ఆధ్వర్యంలో బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా రామ సూర్యారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పాఠ్యాంశాలను బోధించాలన్నారు. సత్యవతిని సర్పంచి చింతపల్లి రామకృష్ణ, ఎంపిపి కె.సరోజిని, ఎంఇఒ డి.శారదాజోత్స్న, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెవిఎన్‌వి శ్రీనివాస్, ఎంపిడిఒ బి. రాంప్రసాద్ అభినందనలు తెలిపారు.

మార్టేరులోని జ్యోతిరావు సావిత్రి జయంతి వేడుకలు బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆచంట నియోజకవర్గ కార్యదర్శి కడలి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు, మార్టేరులోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని సత్కరించారు. అనంతరం మార్టేరు నాలుగు రోడ్ల కూడలిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేశారు.

నరసాపురం: సావిత్రిబాయ్‌పూలే మొట్ట మొదటి ఉపాధ్యాయురాలని బైనపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీఆర్ సునీల్‌కుమార్ అన్నారు. సావిత్రిబాయ్ జయంతి వేడుకల సందర్భంగా విద్యార్థులకు పలు విషయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కొప్పర్తి త్రిమూర్తులు, పిఆర్‌పి మణి పాల్గొన్నారు.

పోడూరు: భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయ్‌పూలే అని ఎంపిపి గుంటూరి వాణి పెద్దిరాజు అన్నారు. కొమ్ముచిక్కాలలో ఎస్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయ్ పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు యు.సాల్మన్‌రాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎంపిపి వాణి పెద్దిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎంవి రాజశేఖర్, జి.సత్యనారాయణ, వై.పెద్దిరాజు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి టిడిపి కృషి

'జన్మభూమి' సభల్లో టిడిపి నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజారోగ్యానికి టిడిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక 6వ వార్డులో జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రయివేటు ఆసుపత్రుల కంటే మెరుగ్గా తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పసుపులేటి రత్నమాల, గుగ్గిలపు ధర్మ, పొన్నాడ నాగబాబు పాల్గొన్నారు.

స్థానిక బిజిబిఎస్ మహిళా కళాశాల వద్ద జన్మభూమి, మాఊరు కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ కె.అమ్మాజీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌సి హాస్టల్ వార్డెన్ పి.రత్నకుమారి విచ్చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్స్, ఎఎన్ఎం బి.రేఖానాయుడు, ఆశా వర్కర్ బి.కుసుమకుమారి పాల్గొన్నారు.

జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో భాగంగా యర్రంశెట్టివారిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను సర్పంచి కూనపరెడ్డి రంగారావు ప్రారంభించారు.

పాలకొల్లు: మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం త్వరలో ఒక ప్రకటన విడుదల చేస్తున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రకటించారు. 29వ వార్డులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ వనరులు సద్వినియోగం చేసుకోవాలంటే అందరూ ఆరోగ్యంగా ఉండేటే ఫలితం ఉంటుందన్నారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్యమని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి, వైస్ ఛైర్మన్ కర్నేన రోజారమణి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన్మభూమి ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కొనసాగుతోందని ఎంపిపి పెన్మెత్స శ్రీదేవి అన్నారు. తిల్లపూడి, అరట్లకట్ట, గవరపేట గ్రామాల్లో బుధవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. తిల్లపూడిలో సర్పంచి కత్తిమండ వీరయ్య అధ్యక్షతన జరిగిన సభలో టిడిపి సీనియర్ నాయకులు, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు అందే కోటి వీరభద్రరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కోడి విజయలక్ష్మి, జన్మభూమి కన్వీనర్ విజయభాస్కరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పేదప్రజల అభ్యున్నతికి, సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. బుధవారం పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్‌లో జన్మభూమి, గ్రామసభలు నిర్వహించారు. సాయంత్రం పేరుపాలెం సౌత్‌లో సర్పంచి మేళం బన్ను అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడి ఉన్నా సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుకు ఆటంకం రాకుండా ముఖ్యమంత్రి పాటుపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై సమీక్షించారు. పేరుపాలెం నార్త్‌లోని 107 డ్వాక్రా గ్రూపులకు రూ.40 లక్షల 4వేలు, పేరుపాలెం సౌత్‌లోని 166 డ్వాక్రా గ్రూపులకు రూ.65 లక్షల 40 వేలు వడ్డీలేని రుణపత్రాలను అందించారు. ఈ రెండు పంచాయతీల్లోనూ 421 మంది విద్యార్థులకు సుమారు రూ.ఐదు లక్షల ఉపకారవేతనాలను ఆయన అందించారు. అనంతరం సామూహిక సీమంతంలో ఆయన పాల్గొన్నారు. పౌష్టికాహారంపై అంగన్‌వాడీలు తయారు చేసిన పిండి వంటలను ఆయన రుచి చూసి అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిపి కత్తిమండ వెంకటముత్యాలరావు, జెడ్‌పిటిసి గుబ్బల నాగరాజు, వైస్ఎంపిపి ఆండ్రాజు రామన్న, ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ శ్రీపాద హరినాథ్, సర్పంచి కవురు ముత్యాలరావు, ఆరోగ్య కమిటీ ఛైర్మన్‌లు బండారు పటేల్ రాజానాయుడు, రాయుడు లక్ష్మణరావు, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జన్మభూమిలో.. బుర్రకథ

ప్రజాశక్తి - ఆచంట

జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం పెదమల్లం, కోడేరు, కొడమంచిలి, పెనుమంచిలి గ్రామాల్లో ప్రభుత్వ పథకాల్లో భాగంగా బడి పిలుస్తోంది, ఆత్మ గౌరవ దీక్ష, పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల తదితర విషయాలపై కళాజాత ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఏలూరుకు చెందిన పార్వతి బుర్రకథ బృందం ప్రజలకు సవివరంగా బుర్రకథ రూపంలో ప్రదర్శించారు. ఈ బుర్రకథను ప్రజలు ఆసక్తిగా ఆలకించారు.

కళకళ.. వెలవెల

ప్రజాశక్తి - పాలకొల్లు

రెండో రోజు మూడు, నాలుగు, 29 వార్డుల్లో బుధవారం జరిగిన జన్మభూమి సభల్లో డ్వాక్రా మహిళలను తీసుకురావడంతో సభలు కొద్దిగా కళకళలాడాయి. మూడు, నాలుగు వార్డుల్లో జరిగిన సభల్లో మున్సిపల్ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి, వైస్ ఛైర్మన్ కర్నేన రోజారమణిలతో పాటు కౌన్సిలర్లు, జనంతో కళకళలాడాయి. అయితే 29వార్డులోని సభ జనం, నాయకులు లేక వెలవెలబోయింది. మధ్యాహ్నం ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.



మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్‌లో చంద్రన్నకానుకల పంపిణీ

వక్తృత్వ పోటీల్లో స్వర్ణాంధ్ర విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నరసాపురం

విద్యుత్ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సరఫరా సంస్థ ఇటీవల వివిధ కళాశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో స్వర్ణాంధ్ర విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు కైవసం చేసుకున్నారు. స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన నవ్య పరిమిణి, మైఖేల్, దుర్గ భజంగరావు, మైనిక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. వారిని స్వర్ణాంధ్ర కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సత్తెశాల రమేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ కీర్తికుమార్, ట్రెజరర్ కెవి స్వామి అభినందించారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని నరసాపురం పార్లమెంటు వైసిపి అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం తన స్వగృహంలో ఎల్‌బిచర్లకు చెందిన వైసిపి నాయకులు బొడ్డు ఆశీష్‌కుమార్, గుబ్బల వెంకట నారాయణ ముద్రించిన ఎ టు జడ్ ఈవెంట్స్ క్యాలెండర్‌ను ప్రసాదరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సయ్యపురాజు వర్మ, దొంగ మురళీకృష్ణ, వైకెఎస్, కొట్టు త్రిమూర్తులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజులపై జిఎస్‌టి సరికాదు

పాలకొల్లు: ఈ ఏడాది జరిగే ఆసెట్, ఎంసెట్ వంటి ఇతర పోటీ పరీక్షలు, యూనివర్శిటీ పరీక్షల ఫీజులపై 18 శాతం జిఎస్‌టి విధించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ఎస్‌సి యునైటెడ్ ఫ్రంట్ ఒక ప్రకటనలో నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫ్రంట్ అధ్యక్ష కార్యదర్శులు బివి.రావు, ఎస్‌బి రాజు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇప్పటికే ఆన్‌లైన్ పరీక్షా విధానాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరీక్షలపై జిఎస్‌టి విధించాలని నిర్ణయించడం దురదృష్టకరమని తెలిపారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

5న పాలకొల్లులో నారా లోకేష్ పర్యటన

పాలకొల్లు: ఈ నెల ఐదో తేదీ శుక్రవారం రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ పాలకొల్లు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నేరుగా ఆయన అమరావతి నుండి పాలకొల్లు నియోజకవర్గం రావడానికి పట్టణంలోని ఒక వార్డుతో పాటు, పాలకొల్లు మండలం, యలమంచిలి మండలంలో కూడా జన్మభూమి సభల్లో పాల్గొనేలా ఆయన ఏర్పాట్లు చేస్తున్నారు.

విలేజ్‌మాల్స్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ధర్నా

నరసాపురం: రేషన్ షాపుల స్థానంలో షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థను కాపాడాలని రేషన్‌షాపుల్లో అన్ని రకాల నిత్యావసర సరుకులూ సబ్సిడీపై పంపిణీ చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఎల్‌బిచర్లలో చౌక డిపో వద్ద బుధవారం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ టిడిపి అధికారం చేపట్టిన నాటి నుండి నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని విమర్శించారు. రేషన్‌షాపులకు బదులుగా విలేజ్ మాల్స్ ఏర్పాటు చేస్తే నిత్యావసరాల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. చిన్న వ్యాపారులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జల్లి రామ్మోహనరావు, తోట సూర్యనారాయణ, పొన్నమండ సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ, జల్లి బాబూరావు, పొన్నమండ బండి ముత్యాలమ్మ, జల్లి నాగేశ్వరరావు, కె.రెడ్డినాయుడు, గుబ్బల పుల్లంశెట్టి పాల్గొన్నారు.



ఎల్‌బిచర్లలో రేషన్ డిపో వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

నేటి నుండి వంతులవారీ విధానం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల నాలుగో తేదీ నుండి జిల్లాలో వంతులవారీ విధానాన్ని అమలు చేస్తున్నట్లు గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పొత్తూరి రామాంజనేయులు ప్రకటించారు. బుధవారం నీటి ఎద్దడి ఉన్న పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో నీటి పారుదల శాఖ ఎస్ఇ ఆర్.రఘునాథ్, ఇఇ జి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. ప్రస్తుతం గోదావరిలో పశ్చిమడెల్టా ద్వారా 4,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, గోదావరికి వచ్చే 80 శాతం సీలేరు నుండే నీరు వస్తున్నట్లు చెప్పారు. నీటి వేగం 1500కు పడిపోగా, అందరికీ సాగునీరు అందించేందుకు తప్పని పరిస్థితిలో గురువారం నుండి వంతులవారీ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. కవిటం ఎగువ, దిగువ రెండు ప్రాంతాలుగా విడదీసినట్లు చెప్పారు. దాళ్వాకు సాధారణంగా 5వేల క్యూసెక్కుల నీరు కావాలని, మొత్తం జిల్లాలో నాలుగు లక్షల 60 వేల ఎకరాల్లో రబీ సాగవుతోందని ప్రకటించారు. ఇంత వరకు 60 శాతం నాట్లు పూర్తయ్యాయని, ఎగువ ప్రాంతంలో ఎక్కువగా నాట్లు పడితే పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో తక్కువగా నాట్లు పడ్డాయని, సంక్రాంతికి 90 శాతానికి పైగా నాట్లు పూర్తవుతాయని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చేపలు, రొయ్యల చెరువులకు నీరు తోడేందుకు అనుమతించమని, సాగునీటి ఎద్దడి లేకుండా రూ.నాలుగు కోట్ల ఖర్చుతో 150 చోట్ల మురుగు కాలువల్లో క్రాస్ బండ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటించారు. జిల్లాలో రైతులు నీరు తోడుకునేందుకు 150 మోటారు ఇంజన్లు ఇచ్చామని, దీనికి సంబంధించి కరెంటును జిల్లా కలెక్టర్ అందజేస్తున్నట్లు ప్రకటించారు. పాలకొల్లు నియోజవర్గంలో ఆరుచోట్ల మోటారు ఇంజన్లు అందించినట్లు ఇరిగేషన్ శాఖ ఇఇ జి.శ్రీని వాసరావు తెలిపారు. ఈ సమావేశంలో డిఇ సిహెచ్ వెంకటనారాయణ, ఎఇ, పిల్లా సత్యనారాయణ, డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ ఉంగరాల లక్ష్మీ నరసింహారావు పాల్గొన్నారు. పాలకొల్లు లాకుల వద్ద సాగునీటి పరిస్థితిని వారు స్వయంగా పరిశీలించారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

జన్మభూమి - మా ఊరులో ఆదివాసీల ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి వీల్లేదంటూ ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని మక్కినగూడెంలో నిర్వహించిన జన్మభూమి – మా ఊరు గ్రామసభ వద్ద గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు, కురసం నిరీక్షణరావు, గొంది ప్రసాద్, టి.నాగేశ్వరరావు 50 మంది వరకూ గిరిజనులు సభాస్థలానికి చేరుకుని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిపి శీలం వెంకటేశ్వరరావుకు అందజేశారు. అరగంటపాటు ఆందోళన చేపట్టారు దీంతో కొద్దిసేపు గ్రామసభ నిలిచిపోయింది. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో గిరిజనులతో చర్చించిన ఎంపిపి గిరిజనుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో వారు విరమించారు. అనంతరం మక్కినవారిగూడెంలో జరిగిన జన్మభూమి సభలో గ్రామపెద్ద ఆకుల సత్యనారాయణ మరికొందరు స్థానిక జెడ్‌పి హైస్కూల్ ఆవరణ ఆక్రమణకు గురైందని పాఠశాల తరగతి గదులు శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఎర్రగుంటపల్లి నుండి లక్ష్మీపురం వరకూ ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో రోడ్డు అధ్వానంగా ఉందని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకటచలపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జయవరపు శ్రీరామ్మూర్తిల ద్వారా రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పిన్నమనేని మధు, సొసైటీ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ, సర్పంచులు తుత్తరపుడి అనురాధ, చిట్టెమ్మ పాల్గొన్నారు.



యువత క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలి

జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యువత క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. బుధవారం స్థానిక విమానాశ్రయ భూముల్లో శశి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను బాపిరాజు, మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మాట్లాడుతూ పండుగ సమయాల్లో చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రీడా స్ఫూర్తిని కలిగి ఉంటే మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం కలిగి ఉండొచ్చన్నారు. అన్ని ప్రాంతాల వారు క్రీడాపరంగా కలుసుకోవడం ద్వారా స్నేహ భావం పెరుగుతుందన్నారు. విద్యతో పాటూ క్రీడలపై ఆసక్తి కనబరచడం ద్వారా విద్యా, ఉద్యోగపరంగా ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చన్నారు. గ్రామాల్లోని యువత వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ వంటి వాటిపై దృష్టిసారిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ యువతను చెడు వ్యసనాల వైపు మళ్లకుండా మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నందుకు నిర్వహణ కమిటీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ గొర్రెల శ్రీధర్‌ను ఆయన అభినందించారు. కృషి పట్టుదలతో సాధన చేస్తే ఏ క్రీడలోనైనా విజయం సాధించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కిల్లాడి ప్రసాద్, కౌన్సిలర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

14 నుండి జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

గోగులమ్మతల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకూ మహిళ, పురుషుల జాతీయస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహణ కన్వీనర్, మాజీఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అత్యంత వైభవంగా సిల్వర్‌జూబ్లీ వేడుకలను నిర్వహిస్తామని, ప్రత్యేకంగా సింథటిక్ కబడ్డీ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో ప్రత్యేకప్రతిభ కనబర్చిన వారికి ప్రత్యేకమైన బహుమతులు, షీల్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. లీగ్ నాకౌట్ పద్ధతిలో ఈ మ్యాచ్‌లు జరుగుతాయని, 15 మహిళా టీమ్‌లు, 15 పురుష టీమ్‌లు పాల్గొంటాయని, మొత్తం 300 మంది క్రీడాకారులు, వంద మంది రిఫరీలు, మేనేజర్లు పాల్గొంటారని ఆయన తెలిపారు. కో కబడ్డీ ప్లేయర్లు కూడా ఈ పోటీల్లో పాల్గొంటారని, మహిళా క్రీడాకారులు వంటి ఇంటర్నేషనల్ ప్లేయర్లు గాయత్రి, గౌరీ, పురుషులు కో కబడ్డీ ప్లేయర్లు శ్రీకాంత్‌రెడ్డి, మనోజ్‌కుమార్ పాల్గొంటారని ఆయన తెలిపారు. మొత్తం విజేతలకు పురుషులు, మహిళలకు నాలుగు విభాగాల్లో బహుమతులుంటాయని, మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాలుగో బహుమతి రూ.25 వేలు అని, 14వ తేదీ సాయంత్రం క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తామని జానకీరామ్ తెలిపారు. క్రీడాభిమానులు పెద్దఎత్తున పాల్గొని ఈ పోటీలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ ఎన్‌విఆర్.దాసు, కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ ఎం.రంగారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ డి.శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ వారు యాదంరెడ్డి మహేష్, చాగంటి బాబి, బి.బాబ్జీ, మండా గోపి, గన్నాబత్తుల సత్యనారాయణ, జి.రవి పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న మాజీ ఎంఎల్ఎ జానకీరామ్

దొంగరావిపాలెం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - యలమంచిలి

బ్యాంక్ కెనాల్ ద్వారా పెనుగొండ, ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాలలోని 30వేల ఎకరాలకు సాగునీరందించేందుకు దొంగరావిపాలెం వద్ద శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని వెంటనే నిర్మించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం యలమంచిలి మండలం శివారు ప్రాంతమైన ఏనుగువానిలంక గ్రామం నుండి మోటారు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వలవల శ్రీరామ్మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సభలో బలరాం మాట్లాడుతూ దాళ్వా పంటకు నీటి ఎద్దడి రానుందని అధికారులు, ఇంజనీర్లు ముందస్తుగానే హెచ్చరించినప్పటికీ దొంగరావిపాలెం వద్ద శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదని విమర్శించారు. పది సంవత్సరాల క్రితం సిపిఎం, రైతు సంఘం చేసిన పోరాట ఫలితంగా తాత్కాలిక ఎత్తిపోతలను ప్రారంభించి దాన్ని కూడా నిర్వీర్యం చేశారని, గోదావరి చెంతనే పెనుగొండ, ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాలు ఉన్నప్పటికీ సాగునీటికి, తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించి దొంగరావిపాలెం వద్ద శాశ్వత ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఈ యాత్ర చించినాడ, యలమంచిలి, ఆర్యపేట, శిరగాలపల్లి, కట్టుపాలెం, వడ్డిలంక, నార్నిమెరక, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, ఇలపకుర్రు, కాంబొట్లపాలెం మీదుగా ఆచంట, పోడూరు, పెనుగొండ మండలాల మీదుగా దొంగరావిపాలెం వరకూ ఈ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, నాయకులు ఆకుల హరేరామ్, కేతా గోపాలన్, కేతా సూర్యారావు, బాతిరెడ్డి జార్జి, జవ్వాది శ్రీనివాసరావు, పిల్లి ప్రసాద్, మాసవరపు సుబ్బారావు, కానేటి బాలరాజు, దేవ సుధాకర్, పొత్తూరి నరసింహరాజు పాల్గొన్నారు.



ఏనుగువానిలంక గ్రామంలో మోటారుసైకిల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బలరాం

మార్చి నెలాఖరు నుండి కాలువల మూసివేత : మంత్రి పితాని



మాట్లాడుతున్న మంత్రి పితాని

ప్రజాశక్తి - ఆచంట

మార్చి నెలాఖరు నుండి కాలువలు మూసివేస్తామని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెదమల్లం, కోడేరు, కొడమంచిలి, పెనుమంచిలి గ్రామాల్లో జన్మభూమి, – మా ఊరు కార్యక్రమం ఆయా గ్రామ సర్పంచులు కొండేటి వీరాస్వామి, పెచ్చెట్టి సత్యనారాయణ, చిలుకూరి వీరవెంకట సత్యనారాయణమూర్తి, వర్ధనపు నవమోహిని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రమంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రైతులందరూ త్వరితగతిన నాట్లు పూర్తి చేసుకోవాలని, మార్చి నెలాఖరు నాటికి ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. జన్మభూమి కార్యక్రమానికి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని లేనిపక్షంలో సెలవుపై వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. పెదమల్లం, కోడేరులో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, స్థానికులు మంత్రికి విన్నవించారు. ఈ విషయంపై మంత్రి మాట్లాడుతూ కొత్త పైపులైన్ల ప్రతిపాదనలు పెట్టామని, త్వరలో నీటి సమస్య తీరనున్నట్లు తెలిపారు. మరుగుదొడ్ల అవకతవకలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారని, విచారణ అనంతరం బిల్లుల వెరిఫికేషన్‌లో నేరాలు రుజువైతే శిక్ష తప్పదని హెచ్చరించారు. వేలిముద్రలు పడనివారు రోజులతో పని లేకుండా వచ్చిన లబ్ధిదారులకు తక్షణం విఆర్ఓ బాధ్యత తీసుకుని రేషన్ అందించాలని కోరారు. కోడేరులో ఇళ్లు, డ్రెయినేజీ సమస్య ఎక్కువగా ఉందని గ్రామస్తులు కోరారు. రేషన్‌షాపు డీలర్ సరిగా రేషన్ ఇవ్వడం లేదని, దీంతో లంక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి విన్నవించారు. సమస్య పరిష్కరించాలని తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

సమస్యల పరిష్కార వేదిక.. జన్మభూమి–మా ఊరు కార్యక్రమం చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఆచంట మండలంలో నాలుగు గ్రామాల్లో సుమారు మూడు గంటల్లోనే మమ అనిపించి చేతులు దులుపుకున్నారు. తమ సమస్యను చెప్పుకుందామని వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సభలు అంతంత మాత్రంగానే జరిగాయి. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), ప్రత్యేకాధికారి బి.గంగయ్య, ఎఎంసి ఛైర్మన్ ఉప్పలపాటి సురేష్‌బాబు, సానబోయిన గోపాలకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బండి రామారావు, ఎంపిపి మేకా పద్మకుమారి, మండల ప్రత్యేకాధికారి పివి.కొండయ్య, తహశీల్దార్ కె.రాజేంద్రప్రసాదరావు, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.